www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

సోమవారం 29 డిసెంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 175 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## జెప్టో రూ.11వేల కోట్ల ఐపీఓ.. సెబీకి పత్రాలు

క్విక్ కామర్స్ దిగ్గజం జెప్టో ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూకి సంబంధించిన ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ విధానంలో మార్కెట్ల నియంత్రణ సంస్థకు సమర్పించింది. దీని ప్రకారం కంపెనీ సుమారు రూ. 11,000 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాదిలో కంపెనీ లిస్టయ్యే అవకాశం ఉంది. ఒకవేళ ఈ ఐపీవో సజావుగా సాగితే కార్యకలాపాలు ప్రారంభించిన అత్యంత తక్కువ వ్యవధిలోనే లిస్టయిన యువ అంకుర సంస్థగా జెప్టో నిలుస్తుంది. అలాగే పోటీ సంస్థలు జొమాటో, స్విగ్గీ సరసన కూడా చోటు దక్కించుకుంటుంది. 10 నిమిషాల్లో డెలివరీ సర్వీసుల పేరిట ప్రారంభమైన జెప్టో 7 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో




## త్వరలోనే భారత్ నుంచి మలేరియాను పూర్తిగా తొలగిస్తాం

- భారత్‌లో మలేరియా కేసులు 97 శాతం తగ్గాయి
- అతి త్వరలో దేశం నుంచి పూర్తిగా మలేరియాను తరిమేస్తాం
- ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైంది
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



## దేశానికి గర్వకారణం 2025

- ఈ సంవత్సరం దేశానికి అమితమైన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది
- ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకునే ఎన్నో ఘట్టాలు ఈ ఏడాదిలో చోటుచేసుకున్నాయి
- దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, ప్రపంచంలో తన స్థానాన్ని మరింత ఉన్నతంగా నిలబెట్టుకున్నది
- 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

# దుమ్ముదుమారమే!



- అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్..
- ముఖ్యమంత్రి రేవంత్ టీమ్ రెడీ..
- తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి..
- నదీ జలాల పంపిణీ, పాలమూరు ప్రాజెక్ట్‌లపై చర్చ జరిగే అవకాశం ఉంది..
- అయితే.. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందే హాట్‌టాపిక్‌గా మారాయి..

హైదరాబాద్:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం (డిసెంబర్ 29 2025) నుంచి ప్రారంభం కాబోతున్నాయి.. అయితే.. ప్రారంభానికి ముందే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్‌టాపిక్‌గా మారుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారనే ప్రచారం.. అయితే.. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా?.. లేదా?.. అనేది తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇటీవల బీఆర్ఎస్ నేతలతో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్.. ఆ తర్వాత.. ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. నదీ జలాల పంపిణీ, పాలమూరు ప్రాజెక్ట్‌ల విషయంలో రేవంత్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాలమూరు–రంగారెడ్డి - మిగతా3లో



## అసెంబ్లీని కనీసం 15 రోజులు నడిపించాలి

- కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డిమాండ్
- బీఆర్ఎస్ హయాంలో ఎక్కువ రోజులు సమావేశాలు నడిపించాం
- రెండేళ్లలో ఓవరాల్‌గా రేపటికి 40 రోజులు జరిపింది
- సభ నడపాలంటే కాంగ్రెస్ జంకుతుంది
- మేం లేవనెత్తిన ఒక్క అంశం మీద కూడా చర్చ పెట్టట్లేదు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే ప్రతిపక్షం బాధ్యత

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కువ రోజులు సమావేశాలు నడిపించామని గుర్తుచేశారు. దాదాపు ఒక సెషన్ 32 రోజులు నడిపించామని తెలిపారు. కాంగ్రెస్ మొత్తంగా 16 రోజులు నడిపించిందని పేర్కొన్నారు. రెండేళ్లలో ఓవరాల్‌గా రేపటికి 40 రోజులు జరిపిందని చెప్పారు. సభ - మిగతా3లో

## మోదీ పాలనతో ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం

- సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు
- మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తోంది
- 'కాంగ్రెస్ ఏర్పాటయ్యాక, ద్వేష స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాటం చేశాం
- స్వతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు, మరెన్నో బలిదానాలు జరిగాయి.
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే





## సబ్‌మెరైన్‌లో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# స్కూల్‌కు రారు అటెండెన్స్ మాత్రం ఫుల్



- అనధికారికంగా టీచర్ల గైర్హాజరు
- ప్రతిరోజూ విధులకు అనధికారికంగా ఐదారు వేల మంది టీచర్ల గైర్హాజరు
- ముఖ గుర్తింపు హాజరు అమల్లోకి వచ్చినా మారని తీరు
- షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్న సంబంధిత డీఈవోలు

హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ ముఖ గుర్తింపు హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్) అమలు చేస్తున్నా, పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరు మాత్రం తగ్గడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సెలవు పెట్టకుండా, అనధికారికంగా గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులు ఏకంగా వేలల్లో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. సమగ్ర శిక్ష అధికారుల లెక్కల ప్రకారం సగటున ప్రతి రోజూ 5 నుంచి 6 వేల మంది వరకు ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయడం లేదు. ఒక్కో రోజు ఆ సంఖ్య తొమ్మిది వేలకు మించుతుండటంతో ఉన్నతాధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ వర్గాలు మాత్రం ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో టెక్నికల్ - మిగతా3లో


## జీ-2 పద్ధతిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి
- పట్టణ ప్రజల అవసరాలు, డ్రైనేజీ ఇతర ఏ సేవలకైనా మాకోసం ఒక కార్యాలయం ఉంది
- సిబ్బంది ఉన్నారు అన్న భావన కల్పించేందుకు ఈ భవనానికి శంకుస్థాపన
- ఒకపక్క ఏరు.. మరోపక్క చెరువుతో మధిర పట్టణం విస్తరణ సమస్యను ఎదుర్కొంటోంది
- ప్రజలు మాత్రం మధిరలో నివసించేందుకు పోటీ పడుతున్నారు

మధిర

స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు గొప్ప చరిత్ర కలిగిన పట్టణం మధిర.. ఈ పట్టణంలో అభివృద్ధిని ఉరకలు పెట్టిస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర పురపాలక కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం ఏర్పాటు - మిగతా3లో





## భారత్ దెబ్బకు పాక్ సైనికులు వణికిపోయారు

- అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు
- ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌పై భారత్ దాడులు చేసింది.
- భారత్ దెబ్బకు పాకిస్తాన్ సైన్యం బంకర్లలో దాక్కున్నారు
- ప్రాణాలు కాపాడుకునేందుకు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు
- నన్ను కూడా బంకర్లలో దాక్కోవాలని సలహా ఇచ్చారు
- కానీ, నేను అలా చేయలేదు అంటూ కామెంట్స్


# దేశానికి గర్వకారణం 2025

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది(2025)లో చివరిదైన తన రేడియో కార్యక్రమం 'మన కీ బాత్'లో ప్రసంగించారు. 2025 భారత్‌కు గర్వకారణంగా నిలిచిన ఏడాదిగా అభివర్ణించారు. ఈ సంవత్సరం దేశానికి అమితమైన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని పేర్కొన్న ఆయన.. ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకునే ఎన్నో ఘట్టాలు ఈ ఏడాదిలో చోటుచేసుకున్నాయన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, ప్రపంచంలో తన స్థానాన్ని మరింత ఉన్నతంగా నిలబెట్టుకున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఆపరేషన్ సిందూర్'ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది దేశ భద్రతకు సంబంధించి ఒక కీలకమైన మలుపుగా నిలిచిందని, భారత్ తన భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడదనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఆపరేషన్ అందించిందని అన్నారు. ఈ విజయంతో దేశ ప్రజల్లో భారత సైన్యం సామర్థ్యంపై నమ్మకం మరింత బలపడిందని అన్నారు. క్రీడారంగంలో భారత్ సాధించిన విజయాలను గుర్తు చేసిన ప్రధాని.. 2025 భారత క్రీడా చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన సంవత్సరం అని అన్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకోవడం,



మహిళల క్రికెట్ జట్టు వన్డే వరల్డ్ కప్‌ను తొలిసారిగా సాధించడం దేశానికి అమితమైన ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పారా అథ్లెట్లు కూడా అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి, దేశ ప్రతిష్ఠను పెంచారని ప్రధాని పేర్కొన్నారు. విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోనూ భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని, అంతరిక్ష పరిశోధనల్లో భారత శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయన్నారు. భారత అంతరిక్షయాత్రికుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లడం దేశానికి గర్వకారణమని అన్నారు. సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా కూడా 2025 విశేషమైన సంవత్సరమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన వేడుకలు జాతీయ ఐక్యతను ప్రతిబింబించాయన్నారు. మహా కుంభమేళా ప్రపంచాన్ని ఆకర్షించే స్థాయిలో విజయవంతంగా జరిగిందన్నారు. అయోధ్యలో రామమందిరానికి సంబంధించిన ఘట్టాలు కోట్లాది మంది హృదయాల్లో భావోద్వేగాలను రేకెత్తించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పర్యావరణ సంరక్షణ విషయంలోనూ భారత్ ముందడుగు వేసిందని, జంతు సంరక్షణ చర్యలతో చిరుతపులుల సంఖ్య పెరగడం దేశం సాధించిన విజయాలకు ఉదాహరణలని ప్రధాని అన్నారు. ప్రసంగం ముగింపులో ప్రధాని మోదీ.. 2025 భారత్‌కు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిన సంవత్సరం అని పునరుద్ఘాటించారు. ఈ విశ్వాసంతోనే దేశం 2026లోకి అడుగుపెడుతున్నదని, కొత్త ఆశలు, కొత్త సంకల్పాలతో భారత్ ముందుకు సాగుతున్నదని అన్నారు. ప్రతి పౌరుడు దేశ అభివృద్ధిలో భాగస్వామిగా మారాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## త్వరలోనే భారత్ నుంచి మలేరియాను పూర్తిగా తొలగిస్తాం



భారత్ నుంచి మలేరియాను త్వరలోనే పూర్తిగా తొలగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. నేడు అహ్మదాబాద్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. భారత్‌లో మలేరియా కేసులు 97 శాతం తగ్గాయని, అతి త్వరలో దేశం నుంచి పూర్తిగా మలేరియాను తరిమేస్తామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యవంతమైన ప్రజలు అవసరమని, అందుకు డాక్టర్లు.. ప్రభుత్వ పథకాల లక్ష్యం నెరవేరేలా కలిసి పనిచేయాలని కోరారు. భారత్ ఆరోగ్య రంగంలో తీసుకుంటున్న చర్యలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దేశంలో గడిచిన ఐదేళ్లలోనే డెంగ్యూ మరణాల రేటును 1 శాతం, ప్రసూతి మరణాల సంఖ్య 25 శాతం తగ్గిందని షా వెల్లడించారు. 2014లో రూ.37 వేల కోట్లుగా ఉన్న కేంద్ర ఆరోగ్య బడ్జెట్ ఇప్పుడు రూ.1.28 లక్షల కోట్లకు పెరగడమే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు.

# మోదీ పాలనతో ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం

**ఢిల్లీ:** కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకుందని వ్యాఖ్యానించారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తోంది అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. అనంతరం, మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ..'కాంగ్రెస్ ఏర్పాటయ్యాక, ద్వేష స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాటం చేశాం. స్వతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు, మరెన్నో బలిదానాలు జరిగాయి. దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చుకున్నాం. స్వాతంత్ర పోరాటాన్ని మహాత్మా గాంధీ ముందుండి నడిపించారు. ఆయన నేతృత్వంలో రైతులు, కూలీలు, మహిళలు కలిసి



వచ్చారు. ప్రస్తుతం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయి. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకుంది. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశ స్వరూపాన్ని మార్చింది. ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకొని దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ పని చేసింది. సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తుంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజల గురించి ఆలోచించడం లేదు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. ప్రజల హక్కులను నాశనం చేస్తున్నారు. కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదొడుకులను చూసింది. దేశ ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పని చేస్తూనే ఉంటుంది. ప్రజా వ్యతిరేక విధానాలపై బలంగా సమాధానం ఇవ్వాలి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా భవన్ కేంద్ర బిందువు కానుంది. ప్రజాస్వామ్యం కాపాడేందుకు అందరూ కలిసి రావాలి, పెద్ద ఎత్తున పోరాటం జరగాలి. కాంగ్రెస్ కథమైంది అంటున్నారు, మా దగ్గర అధికారం లేకపోవచ్చు. కానీ, ఆలోచనలు ఆకాంక్షలు అలాగే ఉన్నాయి. కాంగ్రెస్ ధర్మం పేరుతో ఓటు అడగలేదు. కాంగ్రెస్ పోరాటం చేయకుంటే రాజ్యాంగాన్ని ఎవరు రక్షిస్తారు అని వ్యాఖ్యలు చేశారు.

## సబ్‌మెరైన్‌లో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరం నుంచి కల్వరి శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ లో బయలుదేరారు. రాష్ట్రపతి వెంట నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఉన్నారు. కల్వరి క్లాస్ జలాంతర్గామిలో రాష్ట్రపతి ముర్ము ప్రయాణించడం ఇదే తొలిసారి. గతంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కల్వరి శ్రేణి సబ్‌మెరైన్‌లో ప్రయాణించారు. ఆ తర్వాత సబ్‌మెరైన్‌లో ప్రయాణిస్తున్న రెండో రాష్ట్రపతిగా ముర్ము గుర్తింపు పొందారు.

# పెళ్లయిన 10 నెలలలోపే బిడ్డను కంటే భారీగా జరిమానా

నాగరికత పేరుతో నగరాల్లో సహజీవనం చేయడం, వివాహానికి ముందే గర్భం దాల్చడం, ప్రేమ పెళ్లిళ్లు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇలాంటి వ్యవహారాలను తమ గ్రామంలోకి అడుగుపెట్టకుండా చేసేందుకు చైనాలోని యునాన్ రాష్ట్రం లిన్‌కాంగ్ జిల్లాలోగల ఓ గ్రామస్థులు కఠినమైన నిబంధనలు పెట్టుకున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు ఓ తీర్మానం చేశారు. ఆ నిబంధనల ప్రకారం.. గ్రామంలో ఎవరైనా వివాహం కాకుండా కలిసి ఉంటే ఏటా 500 యువాన్లు (సుమారు రూ.6 వేలు) జరిమానాగా చెల్లించాలి. అదేవిధంగా పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి 3,000 యువాన్లు (రూ.38,472) పంచాయతీకి కట్టాలి. పెళ్లయిన తర్వాత 10 నెలల లోపే బిడ్డను కంటే కూడా అంతే మొత్తం ఫైన్ చెల్లించాలి. అదేవిధంగా ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే 1,500 యువాన్లు (సుమారు రూ.19 వేలు), దంపతులు గొడవపడి గ్రామ పెద్దల వద్దకు వస్తే ఇద్దరూ చెరో 500 యువాన్లు (సుమారు రూ.6 వేలు), మద్యం సేవించి గ్రామంలో గొడవ చేస్తే 3 వేల నుంచి 5 వేల యువాన్లు (రూ.38,472 నుంచి రూ.64,120), నిరాధార ఆరోపణలు, పుకార్లు సృష్టిస్తే 500



నుంచి 1,000 యువాన్లు (రూ.6,412 నుంచి రూ.12,824) జరిమానా చెల్లించాలని పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఓ బోర్డును తయారు చేసి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటుచేశారు. సంప్రదాయ కుటుంబ విలువలు, నైతికతను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నియమాలు అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. అయితే అందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెంటనే ఆ బోర్డును తొలగించారు.


## జమ్మూలో 30 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు.. అప్రమత్తమైన భద్రతాబలగాలు..!



జమ్మూ ఏరియా లో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. దాంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో మంచు కురుస్తుండటంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతా దళం అధికారులు వెల్లడించారు. అయితే ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నాయని అన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించినట్లు తెలిపారు.

## భారత్ దెబ్బకు పాక్ సైనికులు వణికిపోయారు

**ఇస్లామాబాద్:** దాయాది దేశం పాకిస్తాన్ అసలు రంగు బయట పడింది. లోన లొటారం పైన పటారం అన్న చందంగా ఇన్ని రోజులు ఆపరేషన్ సిందూర్‌పై పాక్ నేతలు చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా బొక్కబోర్లాపడ్డారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ సైన్యం బంకర్లలో దాక్కున్నారని ఏకంగా ఆ దేశ అధ్యక్షుడే ఒప్పుకోవడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తాజాగా ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌పై భారత్ దాడులు చేసింది. ఈ సందర్భంగా భారత్ దెబ్బకు పాకిస్తాన్ సైన్యం బంకర్లలో దాక్కున్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు. నన్ను కూడా బంకర్లలో దాక్కోవాలని సలహా ఇచ్చారు. కానీ, నేను అలా చేయలేదు అంటూ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ దాడులపై పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్, ఆసిమ్ మునీర్ ఓవరాక్షన్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌ను పాక్ సైన్యం ధీటుగా ఎదుర్కొందని భారత్ యుద్ధ విమానాలనే కూల్చివేసినట్టు వ్యాఖ్యలు చేశారు. ఇక, తాజాగా జర్దారీ వ్యాఖ్యలతో పాక్ నేతలు, అధికారుల గాలి తీసినట్టు అయ్యింది. కాగా, పాకిస్తాన్ ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమవుతోంది. ఆపై అధ్యక్షుడు జర్దారీ చేసిన ఈ ప్రకటన పాకిస్తాన్ బలహీనమైన స్థితిని హైలైట్ చేస్తుంది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అప్పులతో సతమతమవుతున్న పాకిస్తాన్‌కు పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక సైనిక సంసిద్ధతకు సామర్థ్యం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో, పాకిస్తాన్ సైన్యం బంకర్లలో దాక్కోవడం దాని అంతర్గత అభద్రతా భావాన్ని, ఒత్తిడిని బహిర్గతం చేసింది.



**భారత్ దాడులు..**

ఇదిలా ఉండగా.. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి మరీ దాడి చేయడంతో పెద్ద సంఖ్యలో ముష్కరులు హతమయ్యారు. ఉగ్రవాద స్థావరాలు, శిక్షణా కేంద్రాలు నేలమట్టమయ్యాయి. పాక్ వైమానిక కేంద్రాలు, యుద్ధ విమానాలు సైతం ధ్వంసమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌తో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదని సాక్షాత్తూ పాకిస్తాన్ సైన్యమే చెబుతోంది. భారత సైన్యం సత్తా ఏమిటో పొరుగు దేశానికి తెలిసొచ్చింది. దాంతో ముందు జాగ్రత్త చర్యగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దు అయిన నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. కీలక ప్రాంతాల్లో కౌంటర్%-%డ్రోన్ వ్యవస్థలను మోహరించింది. మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడితే సిందూర్ మళ్లీ ప్రారంభమవుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది. అందుకే ఆపరేషన్ సిందూర్ 2.0 భయం పాకిస్తాన్‌ను వెంటాడుతోంది.

## కొత్త పెళ్లి జోష్.. పార్టీ మత్తు నదిలో దూకుడు

**తిరువొత్తియూరు:** కన్యాకుమారి జిల్లా కలియక్కావిలై దగ్గరలోని మెదుగుమ్మల్ ప్రాంతానికి చెందిన ఇవాంజెరీ (28), లాయర్ అయిన ఇతనిపై పలు కొట్లాట కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నెల క్రితం సాహినియా (25) అనే లాయర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొత్త వరుడు ఇవాంజెరీ, ఈ సంవత్సరం క్రిస్మస్ పండుగను స్నేహితులతో కలిసి ఉత్సాహంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం 24వ తేదీన స్నేహితులతో కుళిత్తురైలోని ఓ ప్రైవేట్ మద్యం బార్‌కు వెళ్లి మద్యం విందులో పాల్గొన్నారు. అక్కడ అందరూ ఉత్సాహంగా మద్యం తాగారు. దీంతో మత్తులో ఉన్న ఇవాంజెరి మద్యం బార్ వెనుకకు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న అతను అకస్మాత్తుగా తామ్రపరణి నదిలోకి దూకాడు. తర్వాత నీటిలో కొట్టుకుపోయాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన స్నేహితులు ఈ విషయాన్ని అగ్నిమాపక కేంద్రానికి తెలియజేశారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఓ ప్రాంతంలో అతడి మృతదేహాన్ని గుర్తించారు.



# దుమ్ముదుమారమే!

-మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరో అడుగు ముందుకేసి.. ఇక నుంచి లెక్క మరోలా ఉంటుందంటూ కేసీఆర్ హెచ్చరించడం రాజకీయంగా కాక రేపింది.కేసీఆర్ కామెంట్స్‌పై రియాక్ట్ అయిన సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఆధారాలతో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చించనున్నట్లు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలోనే.. తొలిరోజు అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారనే టాక్ నడుస్తోంది. దీంతో.. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు.. డే వన్ నుంచే హీట్ పుట్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

ఇక% అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరుపై మంత్రి శ్రీధర్‌బాబు రియాక్ట్ అయ్యారు. ఆయన సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని.. అసెంబ్లీలో రాజకీయాలు చేస్తామంటే మాత్రం ధీటుగా సమాధానం ఇస్తామన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. మొత్తంగా కేసీఆర్ హాజరైతే తొలిరోజే అసెంబ్లీ సమావేశాలు హీటెక్కనున్నాయి.

**ముఖ్యమంత్రి రేవంత్ టీమ్ రెడీ..**

మరోవైపు అసెంబ్లీ వేదికగా విపక్షాల విమర్శలన్నింటికీ కౌంటర్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ టీమ్ రెడీ అయింది. ఇప్పటికే మంత్రులంతా ఆయా శాఖల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలలో ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాలు.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది. నీటిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు సర్కార్ ప్లాన్ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు నీళ్ల విషయంలో జరిగిన అన్యాయాన్ని వివరిస్తామంటోంది అధికార పార్టీ. కేసీఆర్ ఆరోపణలన్నింటికీ కౌంటర్ ఇస్తామంటోంది. ఏపీ ప్రభుత్వం అనుమతి లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకోవడానికి చేస్తున్న కృషిని వివరించనుంది.

అసెంబ్లీకి కేసీఆర్

సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొననున్నట్లు బీఆర్ఎస్ తెలిపింది. అసెంబ్లీ సమావేశాలలో పాల్గొనడం కోసం కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి నందినగర్‌లో గల తన నివాసానికి బయిలుదేరినట్లు పేర్కొంది. రేపు జరిగే అసెంబ్లీ సెషన్‌కు అక్కడి నుంచి కేసీఆర్ హాజరు కానున్నట్లు అధికారికంగా వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కేవలం రెండుసార్లు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీ సెషన్లకు హాజరయ్యారు. తొలిసారి గవర్నర్ ప్రసంగానికి హాజరవ్వగా రెండోసారి బడ్జెట్ ప్రసంగానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు సైతం గుప్పించింది. కాగా ఇటీవలే కేసీఆర్ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై చర్చించారు. వాటితో పాటు రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను ఆరాతీశారు.అసెంబ్లీ సమావేశాల్లో నీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

# సర్పంచ్ ఎన్నికల్లో వంగబెట్టి గుద్దితే రేవంత్‌కు సోయొచ్చింది

సర్పంచ్ ఎన్నికల్లో వంగబెట్టి గుద్దితే సీఎం రేవంత్ రెడ్డికి సోయొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతి ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే వాళ్లకు బుద్ధివస్తుందని తెలిపారు. జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు సెమీ ఫైనల్ అని.. అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ అని చెప్పారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడమే మన లక్ష్యమని స్పష్టం చేశారు. అభ్యర్థి ఎవరైనా కారు గుర్తు మీద మాత్రమే ఓటు వేయాలని సూచించారు.



నాగర్‌కర్నూలు జిల్లాలో సత్తా చాటిన సర్పంచ్‌లతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి దిశానిర్దేశం చేశారు. గెలిచిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు భయపడవద్దని సూచించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు మిమ్మల్ని ఏం చేయలేరని తెలిపారు. దేశంలో మీకు రక్షణగా ఉండేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగమని సర్పంచ్‌లకు కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులు మిమ్మల్ని ఏం చేయలేవని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎట్లనో.. గ్రామానికి సర్పంచ్ అట్లనే అని కేటీఆర్ తెలిపారు. ఫైనాన్స్ కమిషన్ నిధులు సీదా గ్రామ పంచాయతీలకు వస్తాయని అన్నారు. ఐదంచెల ప్రభుత్వంలో అందరూ కలిసి మెలిసి పనిచేయాలని సూచించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ విధులు అందరూ తెలుసుకోవాలన్నారు. ఎక్కడ కాంగ్రెస్ ఉంటుందో.. అక్కడ ప్రోగ్రెస్ ఉండదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇంకా రెండేళ్లే కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని.. ఆ తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే పల్లెలు మళ్లీ పచ్చబడతాయని.. గ్రామాలకు లక్ష్మీ కళ వస్తుందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో ఎకరం రూ.150 కోట్లకు చేరిందని కేటీఆర్ అన్నారు. ఆ భూములపై రేవంత్ రెడ్డి కన్ను పడిందని తెలిపారు. హైదరాబాద్‌లో 9300 ఎకరాలపై రేవంత్ కన్నుపడిందని అన్నారు. సాధారణంగా ప్రభుత్వాలు పరిశ్రమలకు భూములు ఇస్తాయని చెప్పారు. రాష్ట్రానికి మంచి జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే తక్కువ ధరకు భూములు ఇస్తామని వివరించారు. అలా పరిశ్రమలకు ఇచ్చిన భూముల్లో ఏదైనా కట్టుకోవచ్చని రేవంత్ రెడ్డి అంటున్నాడని మండిపడ్డారు. రూపాయికి 30 పైసలు కడితే ఏదైనా కట్టుకోవచ్చా అని నిలదీశారు. రూ.5 లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు రేవంత్ రెడ్డి హిల్ట్ పాలసీ తెచ్చిందని విమర్శించారు. లగచర్లలో గిరిజనుల భూములు గుంజుకుంటుంటే అడ్డుకున్నది బీఆర్ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఎంత దోపిడీ చేసినా బీజేపీ మాట్లాడదని అన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలు గట్టిగా కొట్లాడి మరీ సత్తా చాటారని కేటీఆర్ అన్నారు. ఫిబ్రవిర మొదటి వారంలో పరిషత్ ఎన్నికలు వస్తాయని తెలిపారు. త్వరలో కేసీఆర్ బహిరంగ సభతో పాలమూరు ప్రజలను కలుస్తారని పేర్కొన్నారు.

**రేవంత్ ఫ్రస్ట్రేషన్ చూస్తే రేపో మాపో కరుస్తడేమో అని అనిపిస్తుంది.. కేటీఆర్ ఎద్దేవా**

రైతుబంధు పాలనపోయి రేవంత్ రాబందు పాలన వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులు యూరియా బస్తాల కోసం కాళ్ల మీద పడి గోసపడుతున్నారని అన్నారు. రైతులు చలిలో చెప్పులు క్యూలైన్‌లో పెట్టి నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి రైతుల పట్ల ప్రేమ లేదని అన్నారు. కేసీఆర్ హయాంలో యూరియా ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని ఇచ్చామని తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లాలోని సర్పంచ్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అలవిగాని, అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కంటే అన్ని ఎక్కువిస్తామని ప్రజలను ఆశపెట్టారని చెప్పారు. రెండేళ్లు పూర్తయినా ఏమైనయ్ పథకాలను అడిగితే రేవంత్ రెడ్డి బూతులు తిడుతున్నాడని మండిపడ్డారు. మహాలక్ష్మీ పథకం ఏమైందంటే గుడ్లపీకి గోటీలాడతానంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశారని గుర్తుచేశారు. రెండేళ్లలో 10 శాతం పనులు పూర్తి చేయలేకపోయారని తెలిపారు. తట్టెడు మట్టి కూడా తీయకుండా నికృష్టపు మాటలు మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు.కాంగ్రెసోళ్లు పాలమూరు అంటేనే వలసల జిల్లాగా మార్చారని మండిపడ్డారు. ప్రాజెక్టులను పండబెట్టి పాలమూరు జిల్లాను ఎండబెట్టారని చెప్పారు. కేసీఆర్ గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. వైకుంఠధామాలు కట్టామని.. డంప్ యార్డులు కట్టామని చెప్పారు. దేశంలోనే ఉత్తమ పంచాయతీ అవార్డులు 30 శాతం మనకే వచ్చేవి అని అన్నారు. ప్రతి గ్రామాన్ని దేశానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దింది కేసీఆర్ అని కొనియాడారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పడకేసిందని తెలిపారు. రేవంత్ పాలనలో ట్రాక్టర్లలో డీజిల్ లేదు.. వీధి లైట్లు లేవని అన్నారు. నేను ఆంధ్రాలో చదివితే నీకు నొప్పయితే.. నీ అల్లుడిది భీమవరం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి భీమవరం బుల్లెబ్బాయ్ పేరు సరిపోతుందని తెలిపారు. మా నాయన కేసీఆర్ 1984లోనే ఎమ్మెల్యే అని గుర్తుచేశారు. ఎంఎస్ బయోటెక్నాలజీ, ఎంబీఏ చదివానని పేర్కొన్నారు. మన ఇంట్లో మనం పనిచేసుకుంటే తప్పా అని ప్రశ్నించారు. రేవంత్ ఎక్కడికి పోయినా ఆవు కథ లెక్క కేసీఆర్ మీద ఏడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ ఫ్రస్ట్రేషన్ చూస్తుంటే రేపోమాపో కరుస్తాడేమో అని అనిపిస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే యూరియా బస్తాలు దొరికేలా చేస్తానని శపథం చెయ్ అని సవాలు విసిరారు. రూ. 4వేలు పెన్షన్ ఇస్తా అని శపథం చెయ్ అని అన్నారు. బంగారంలాంటి రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. గతంలో ఎట్లుండే నాగర్‌కర్నూలు ఇప్పుడు ఎలా తయారైందని ప్రశ్నించారు.

# స్కూల్‌కు రారు - అటెండెన్స్ మాత్రం ఫుల్

-మొదటిపేజీ తరువాయి

సమస్యలు, అవగాహన లేమి కారణంగా గైర్హాజరు సంఖ్య అధికంగా కనిపిస్తోందని చెబుతున్నాయి.

**అనేక ఐచ్ఛికాలు ఉన్నా :**

రాష్ట్రంలో ఆగస్టు నుంచి ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రెకగ్నిషన్ సిస్టమ్) వ్యవస్థ అమలవుతోంది. ఇందులో భాగంగా టీచర్లు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చి మొబైల్ ఫోన్‌లోని ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలి.

ఒకవేళ ఇతర అధికార పనులపై హాజరుకాని పక్షంలో ఆన్ డ్యూటీ అని, డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పని చేస్తుంటే డిప్యుటేషన్ అని, సెలవు పెట్టిన పక్షంలో సెలవు అని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అసలు ఇలాంటివేమీ లేకుండానే వేల మంది గైర్హాజరవుతున్నారు.

ఉన్నతాధికారులు డిసెంబర్ 22న ఎఫ్ఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 9,031 మంది అనధికారికంగా గైర్హాజరైన సమాచారాన్ని గుర్తించారు. 'వారంతా ఎఫ్ఆర్ఎస్‌లో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. ఎఫ్ఆర్ఎస్ ప్రారంభమై ఐదు నెలలవుతోంది. రెండు, మూడు నెలల పాటు సాంకేతిక సమస్యలు, అవగాహన లేమి వంటి కారణాలు ఉంటాయనే ఉద్దేశంతో ఈ విషయం గురించి ఎవరినీ ప్రశ్నించలేదు. దీన్ని ఆసరాగా తీసుకునే అనేక మంది విధులకు గైర్హాజరవుతున్నట్లు భావిస్తున్నాం' అని విద్యాశాఖకు చెందిన కొంతమంది అధికారులు చెబుతున్నారు.

దీనిపై ఉపాధ్యాయ వర్గాలు మాత్రం భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. 'ఎఫ్ఆర్ఎస్‌లో సాంకేతిక సమస్యలతో యాప్‌లో అటెండెన్స్ నమోదు కావడం లేదు. అందుకే వేలల్లో గైర్హాజరైనట్లు కనిపిస్తోంది. ఉదాహరణకు టీచర్లు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్లిన సందర్భాల్లో తాము విధుల్లో ఉన్నామనే భావనతో ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్‌ను నమోదు చేయడం లేదు' అని గెజిటెడ్ హెచ్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ గంగారెడ్డి చెప్పారు.



ఒకే జిల్లాలో 1,250 మందికి షోకాజ్ నోటీసులు : కామారెడ్డి జిల్లాలో కలెక్టర్, డీఈవో (జిల్లా విద్యా అధికారి) ఉపాధ్యాయుల గైర్హాజరు అంశంపై దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా అనధికారికంగా గైర్హాజరైన 1,250 మందికి ఒకేసారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్‌లో వివరాలేవీ నమోదు చేయడం లేదంటే అనధికారికంగా గైర్హాజరైనట్లే భావిస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి ప్రతిరోజూ జిల్లాల వారీగా గైర్హాజరైన వారి జాబితా డీఈవోలకు పంపించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అంశాల గురించి విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఆ జాబితా ప్రకారం డీఈవోలు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారని తెలిపారు.


**హాజరు కాకపోతే ఉద్యోగం ఊస్టింగే**

వరుసగా నెలరోజుల పాటు అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేసి, ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని గతంలో జరిగిన సమీక్షలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డీఈవోలకు సూచించారు. వాస్తవానికి ఒక రోజు అనధికారికంగా పాఠశాలకు రాకున్నా చర్యలు తీసుకోవచ్చని, కాకపోతే అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడ్డానని, రోడ్డు ప్రమాదానికి గురయ్యానని ఇలా ఏదో ఒక సాకు చూపి కోర్టుల్లో కేసులు వేస్తారన్న అంశాలు ఇక్కడ ఉత్పన్నమయ్యాయి. దాంతో ప్రస్తుతానికైతే షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 50 మంది ప్రభుత్వ టీచర్లను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించామని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కొందరు కనీసం సెలవులను పొడిగించుకుంటామని ఏమాత్రం సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఉద్యోగం నుంచి తొలగించే చర్యలు చేపట్టే అవకాశాలూ ఉన్నాయి.

## అసెంబ్లీని కనీసం 15 రోజులు నడిపించాలి

-మొదటిపేజీ తరువాయి

నడపాలంటే కాంగ్రెస్ జంకుతుందని అన్నారు. శాసన సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని హరీశ్‌రావు అన్నారు. ఎమ్మెల్యేల సంతాపాలు, ఘోష్ కమిషన్ విషయాల మీదే సభ నడిపారని తెలిపారు. మేం లేవనెత్తిన ఒక్క అంశం మీద కూడా చర్చ పెట్టట్లేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే ప్రతిపక్షం బాధ్యత అని స్పష్టం చేశారు. అధికార బలంతో ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. మందబలం ప్రదర్శించి సభను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసీఆర్ మాట్లాడిన అంశాలను.. మాపై మళ్లీ బురద జల్లడానికి అసెంబ్లీని నడుపుతున్నారని విమర్శించారు. 45 టీఎంసీలకు మీరు సంతకం పెట్టారా లేదా సూటిగా చెప్పండని ప్రశ్నించారు. 45 టీఎంసీలకు ఒప్పుకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 45 టీఎంసీలతో రంగారెడ్డిని ఎండబెడుతారా అని నిలదీశారు. డీపీఆర్ వాపస్ వచ్చిందా లేదా? ఆ సంతకం మీదా కాదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీని 45 రోజులు నడపాలని ఆరోజు కాంగ్రెస్ నాయకులు అన్నారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రశ్నించే హక్కు అని.. గొంతు నొక్కుతున్నారని అని ఆనాడు అన్నారని తెలిపారు. ఇప్పుడు మేం అడుగుతున్నాం.. సభను 15 రోజులు కచ్చితంగా నడపాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలాగా కాకుండా మేం ప్రిపేర్ అయ్యి సభకు వస్తామని తెలిపారు. గతంలో కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మాట్లాడుతుంటే ఉత్తమ్ మేం ప్రిపేర్ అయ్యి రాలదేని అన్నాడని విమర్శించారు. నేను ఘోష్ కమిషన్ మీద మాట్లాడుతుంటే ఏడుగురు మంత్రులు అడ్డుపడ్డారని తెలిపారు. మంత్రులకు సమాధానం చెప్పాలా? సబ్జెక్ట్ మాట్లాడాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సభా సంప్రదాయాలను తుంగలో తొక్కిందని అన్నారు. సబ్జెక్ట్ మాట్లాడినంత సమయం ఇవ్వాలని .. మైక్ కట్ చేయవద్దని డిమాండ్ చేశారు. హౌస్ కమిటీలు ఇప్పటికీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు విఫలమయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో పీఏసీ కమిటీ ఎలా వేశారో శ్రీధర్‌బాబుకు తెలుసు కదా అని అన్నారు. శాసనసభకు మొత్తం 18 కమిటీలు ఉంటాయని తెలిపారు. కానీ ఒక్క కమిటీ కూడా వేయలేదని చెప్పారు. బ్యాక్ డోర్ నుంచి నామినేషన్ వేయించి ఆమోదించారని మండిపడ్డారు. అసెంబ్లీలో ఎరువుల కొరతపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిగా చేయనందుకు చర్చ జరగాలని అన్నారు. రైతుబంధు రెండు పంటలకు ఎగ్గొట్టినందుకు చర్చ జరగాలన్నారు. హిల్ట్ పాలసీపై 5 లక్షల కోట్ల కుంభకోణం మీద చర్చ జరగాలన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌పై చర్చ జరగాలని పట్టుబట్టారు. ట్రిపుల్‌ఆర్, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల పీఆర్సీ, డీఏలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ, హైడ్రా బుల్డోజర్‌పై చర్చ జరగాలన్నారు.



కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు 299 టీఎంసీల కోటాకు ఒప్పుకున్నది గత కాంగ్రెస్ ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు. ఆధారాలతో సహా కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపుతామని అన్నారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం కాదు.. ప్రశ్నించే గొంతులను నొక్కే పాలన అని మండిపడ్డారు. 299 టీఎంసీలను వ్యతిరేకిస్తూ అపెక్స్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ ప్రభుత్వం 32 లేఖలు రాసిందని గుర్తుచేశారు. కృష్ణా జలాలను తిరిగి రాష్ట్రాలకు పంచితేనే న్యాయం జరుగుతుందని అన్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చిల్లర, చిచోరా భాష మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. హుందా అనే పదం పలికే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు.

## జీ-2 పద్ధతిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

-మొదటిపేజీ తరువాయి

చేసిన సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగాన్ని కాపాడడానికి 86 మందితో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏర్పడిన అద్భుతమైన రోజు డిసెంబర్ 28 అని తెలిపారు. మధిర పట్టణ ప్రజల అవసరాలు, డ్రైనేజీ ఇతర ఏ సేవలకైనా మాకోసం ఒక కార్యాలయం ఉంది, సిబ్బంది ఉన్నారు అన్న భావన కల్పించేందుకు ఈ భవనానికి శంకుస్థాపన చేస్తున్నట్టు తెలిపారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన నాయకులు పుట్టిన చరిత్రాత్మక నగరం మధిర అన్నారు. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరించకుండా నిజాం ప్రభుత్వం నిషేధం విధిస్తే సర్దార్ జమలాపురం కేశవరావు సవాల్ విసిరి మారువేషంలో వచ్చి మధిర నడిబొడ్డున మూడు రంగుల జెండా ఎగురవేశారని, అది స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిందని గుర్తు చేశారు.

ఒకపక్క ఏరు.. మరోపక్క చెరువుతో మధిర పట్టణం విస్తరణ సమస్యను ఎదుర్కొంటోందని, ప్రజలు మాత్రం మధిరలో నివసించేందుకు పోటీ పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం, భూ సేకరణకు నిధులు కూడా కేటాయించామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోతే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం.. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వర్షం రాగానే కరెంటు స్తంభాలపై చెట్లు పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.. ఈ సమస్యను పరిష్కరించేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్టే మధిర పట్టణంలోని పేదలు నివసించడానికి %+%o2 టవర్స్‌తో హౌసింగ్ కాలనీ నిర్మించబోతున్నాం, త్వరలోనే ఈ కార్యక్రమానికి భూమి పూజ చేస్తానని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర పట్టణం మన అందరిదీ.. పట్టణానికి సమీపంలో అమరావతి నగరం, బందరు పోర్టు, రైల్వే లైన్ ఉండటంతో వస్తువులన్నిటినీ సులభంగా రవాణా చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

## ఒకటి రెండు రోజులు అసెంబ్లీ పెడతామంటే ఒప్పుకునేది లేదు : బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద

రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతుందని.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద స్పష్టం చేశారు. ప్రెస్ మీట్‌లో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు 420 హామీలపై ప్రభుత్వ దాటవేత ధోరణిని ప్రశ్నిస్తామన్నారు. గురుకులాల అసమర్థ నిర్వహణను, విద్యార్థుల మరణాలను ప్రస్తావిస్తాం.. ఎవరిని సంప్రదించకుండా జీహెచ్ఎంసీలో 22 మున్సిపాలిటీలను అశాస్త్రీయంగా ఆర్డినెన్స్ తెచ్చి విలీనం చేయడాన్ని గట్టిగా నిలదీస్తామన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వైఖరిని ఎండగడుతాం.. రైతులకు బోనస్ బోగస్ అయిన అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు.యూరియా కొరతపై రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతాం. మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్‌కు సింగరేణి సంస్థ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. తూతూ మంత్రంగా ఒకటి రెండు రోజులు అసెంబ్లీ పెడతామంటే ఒప్పుకునేది లేదు . ప్రజా సమస్యలన్నీ చర్చించేదాకా అసెంబ్లీ సమావేశాలు పెట్టాల్సిందేనన్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్ కు సీఎం సహా కాంగ్రెస్ నేతలు గజ గజ వణికి పోతున్నారు .అందుకే పిచ్చి కూతలు కూస్తున్నారుజ పదేళ్ల కేసీఆర్ పాలనపై కూడా అసెంబ్లీలో మేము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.



# జమ్మికుంటలో అత్యాధునిక స్టేడియం

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** 6.50 కోట్ల నిధుల మంజూరుకు కృతజ్ఞతగా మోడీ, బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం జమ్మికుంట పట్టణంలో అత్యాధునిక స్టేడియం, సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.6.50 కోట్ల నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ ద్వారా ఈ ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి ఇచ్చిందని తెలిపారు. జమ్మికుంట పట్టణం క్రీడారంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ స్టేడియం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యతో పాటు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రీడల్లో యువత రాణించి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రాంత యువ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి శిక్షణ వసతులు కల్పించాలనే దృక్పథంతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. జమ్మికుంట చుట్టుపక్కల గ్రామాల యువతీ, యువకులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 4-లేన్, 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టును "ఖేలో ఇండియా" పథకం కింద అమలు చేయనుండగా, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం తన వంతుగా రూ.6.50 కోట్ల నిధుల మంజూరుకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు యువజన అభివృద్ధి, పర్యాటకం & సంస్కృతి (క్రీడలు) శాఖ అండర్ సెక్రటరీ చంచల్ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాసినట్లు తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, కైలాసకొటి గణేష్, దొంతుల రాజ్‌కుమార్, రాజేష్ ఠాకూర్, పల్లపు రవి, బచ్చు శివ, అబ్బిడి తిరుపతి రెడ్డి, బుజునూరు ఉపసర్పంచ్, రాకేష్ ఠాకూర్, ఎమనగండ్ల రామస్వామి, మోడం రాజు, రాము, తూడి రవిచందర్, మ్యాదరి శంకర్, పొనగంటి రవి, ఉడుగుల మహేందర్, ఆకుల తిరుపతి, పోచయ్య, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు

## మన్ కీ" "బాత్" కార్యక్రమాన్ని తిలకించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు




**సామాన్యుడు అస్త్రం గోకవరం:** మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు రేడియో ద్వారా ప్రసంగించే "మాన్ కీ బాత్" కార్యక్రమాన్ని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద టీవీలో ప్రత్యక్షంగా తిలకించారు. ప్రతి నెల చివరి ఆదివారం సీఎండీ లే అవుట్ లో యధావిధిగా మన్ కి బాత్ కార్యక్రమాన్ని తిలకించడం జరుగుతుంది. లి నరేంద్ర మోడీ 129 ఎపిసోడ్ ను కంబాల శ్రీనివాసరావు పిలుపు మేరకు మండలంలోని ప్రతి బూత్ లో మాన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగింపుపై కాంగ్రెస్ నిరసన



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** ఏఐసిసి, టీపీసీసీ ఆదేశాల మేరకు సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ గాంధీ చిత్రపటాలతో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగ రామకృష్ణ మాట్లాడుతూ ఖూూా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం గ్రామీణ భారతదేశ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చిందన్నారు. కోవిడ్ వంటి క్లిష్ట సమయంలో ఈ పథకం లేకపోయి ఉంటే లక్షలాది మంది ఉపాధి కోల్పోయి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చేదని తెలిపారు. పేదలకు జీవనాధారం అయిన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం పేదల కడుపు కొట్టడమే కాకుండా వారి వెన్నులో కత్తి దించడమేనని తీవ్రంగా విమర్శించారు. గ్రామీణ రైతు కూలీలు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచిన 100 రోజుల పని పథకాన్ని "కరువు పనులు"గా ముద్రవేసి, చట్టాలను మార్చి బొంద పెట్టే ప్రయత్నం చేయడం దేశానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో వంగ రామకృష్ణ, భోగం సాయిరాం, వార్డు సభ్యులు రెడ్డి సారంగం, ఉపాధ్యక్షులు పుట్ట రాజు, ఎండీ రఫీ, భోగం చిరంజీవి, సాంబమూర్తి, మురహరి రాజు, చిన్న మహిపాల్, సోషల్ మీడియా కన్వీనర్ గొట్టె శేఖర్, యూత్ నాయకులు భోగం శ్యాం, రాజు, శ్రీను, మర్రి సాయి రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## భోగంపాడులో ఇంటి చోరీ



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** 5 గ్రాముల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ మండల పరిధిలోని భోగంపాడు గ్రామంలో చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన శీలం జైపాల్ రెడ్డి ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన తన కుమారుని వివాహ వేడుకలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. పండుగ వాతావరణంలో ఆనందంగా గడిపిన అనంతరం ఈరోజు స్వగ్రామానికి తిరిగి వచ్చి ఇంటిని పరిశీలించగా, ఇంటి ప్రధాన తలుపుకు ఉన్న తాళం తెరిచి ఉండటాన్ని గమనించారు. అనుమానం కలగడంతో ఇంట్లోకి వెళ్లి లోపల పరిశీలించగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బీరువాను తెరిచి ఉంచినట్లు గుర్తించారు. బీరువాలో భద్రపరిచి ఉంచిన 5 గ్రాముల బంగారు ఆభరణాలుతో పాటు రూ.1,00,000 నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. దీంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై వెంటనే ఇల్లందకుంట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. క్రాంతికుమార్ ఇతర పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటి పరిసరాలు, తాళం తెరవబడిన తీరును, బీరువా పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తూ, అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో వరుస చోరీలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ, రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని పోలీసులను కోరుతున్నారు

## కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు.. తాండూర్‌లో వేరువేరుగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**తాండూర్ :** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తాండూర్ మండలంలో రెండు చోట్ల వేరువేరుగా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి నేతల తీరు ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా ఉంది. ఇటీవల బెల్లంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఓ కార్యక్రమంలో పొడచూపిన గ్రూపు విభేదాల నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గ్రూపు రాజకీయాలకు అవకాశం ఇవ్వొద్దని అందరు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మండలంలోని మాదారం టౌన్ షిప్ ఐఎన్టీయూసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరగగా, తాండూరు మండల కేంద్రం ఐబీలో పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దీంతో తటస్థంగా ఉన్న కార్యకర్తలు ఏ కార్యక్రమానికి హాజరు కావాలో తెలియక అయోమయానికి గురయ్యారు.

## సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** సిరిసేడు గ్రామం దేశ రాజకీయ చరిత్రలో సుదీర్ఘమైన, గర్వకారణమైన 141 సంవత్సరాల ప్రస్థానాన్ని కలిగిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు భోగం సాయిరాం కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసి వేడుకలను ప్రారంభించారు. జెండా ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంగారం రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన నుండి ఆధునిక భారత నిర్మాణం వరకు కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. 141 సంవత్సరాలుగా దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల పాలనలో దేశవ్యాప్తంగా బారీసాగు నీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగునీటి భద్రత కల్పించామని, విద్యారంగంలో విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థులకు భవిష్యత్తు అందించామని వివరించారు. అలాగే ఆరోగ్య రంగంలో ప్రాథమిక పేదలకు వైద్య సేవలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలిపారు. విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధిలో కాంగ్రెస్ పాలన మైలురాయిగా నిలిచిందని అన్నారు. అయితే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజా



వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ సామాన్య ప్రజల హక్కులను హరించేస్తోందని ఆరోపించారు. ఈ విధానాలకు ప్రజలు విసుగుచెంది ఉన్నారని, రాబోయే రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పే రోజు తప్పకుండా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వార్డు సభ్యులు రెడ్డి సారంగం, ఉపాధ్యక్షులు పుట్ట రాజు, ఎండీ రఫీ, భోగం చిరంజీవి, సాంబమూర్తి, మురహరి రాజు, చిన్న మహిపాల్, సోషల్ మీడియా నాయకులు గొట్టే శేఖర్, యూత్ నాయకులు భోగం శ్యాం, రాజు, శ్రీను, మర్రి సాయి రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# పంచాయతీలకు ప్రత్యేక నిధులు

**కై లాస్‌నగర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ని ధులతో పాటు సీఎం ప్రకటించిన ప్రత్యేక నిధుల ద్వారా గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించడం, మౌలిక సౌకర్యాల కల్పనకు ఉపకరించనున్నట్లుగా పలువురు కొత్త సర్పంచులు చెబుతు న్నారు. తద్వారా ప్రజలకిచ్చిన హామీలునేరవేర్చే అవకాశం లభించనుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తంచేస్తున్నారు.

**వేధిస్తున్న నిధుల కొరత..**

గ్రామ పంచాయతీలను ప్రస్తుతం నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వాటికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం (ఎఫ్ఎఫ్‌సీ), రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధుల విడుదల సుమారు రెండేళ్లుగా నిలిచిపోయింది. దీంతో పంచాయతీ ఖజానాలో కాసుల్లేక కటకట నెలకొంది. తద్వారా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేని దుస్థితి. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణకు సైతం పంచాయతీ కార్యదర్శులు తిప్పలు పడాల్సిన పరిస్థితి. ఇక ట్రాక్టర్ల నిర్వహణ పూర్తిగా లోపించింది. ఈఎంఐలు కట్టలేని, డీజిల్ సైతం కొనలేని పరిస్థితి. ఇలా అవస్థల నడుమ సాగుతున్న పంచాయతీలకు నూతన పాలకవర్గాలు రావడంతో పెండింగ్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలకానున్నాయనే ఆలోచన ఆనందాన్ని కలిగిస్తోంది.

**పాలకవర్గాల్లో ఆశలు..**

మేజర్ పంచాయతీకి రూ.10లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.5లక్షలను స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 473 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో బేల, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, ఉట్నూర్ వంటి ఐదు మే జర్ పంచాయతీలున్నాయి. వీటికి తోడు మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీలను సైతం మేజర్ పంచాయతీలుగా పరిగణించవచ్చు. ఈ లెక్కన 20 మండల కేంద్రాలు, ఐదు మేజర్ పంచాయతీలు కలిపి 25 వరకు పెద్ద పంచాయతీలున్నాయి. వీటికి రూ.10లక్షల చొప్పున రూ.2.50 కోట్ల నిధులు విడుదలయ్యే అవకాశముంది. మిగతా 448 గ్రామ పంచాయతీలు చిన్న పంచాయతీలే.




ఇందులో 228 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డవే. వీటికి ఎలాంటి ఆదాయ వనరుల్లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మౌలిక సౌకర్యాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటికి రూ.5లక్షల చొప్పున ఇస్తామనే సీఎం ప్రకటనతో అక్కడి పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వీటికి గాను జిల్లావ్యాప్తంగా రూ.22.40 కోట్ల నిధులు విడుదలయ్యే అవకాశముంది. దీంతో పంచాయతీలకు అదనపు ఆర్థిక భరోసా కలిగి సమస్యల పరిష్కారానికి అవకాశముంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రత్యేక నిధుల విడుదలతో పంచాయతీల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని నూతనంగా ఎన్నికై న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులు కూడా విడుదలయ్యేలా చూడాలని కోరుతున్నారు.


**జిల్లాలో**

గ్రామ పంచాయతీలు 473
మేజర్ గ్రామ పంచాయతీలు 05
మండల కేంద్రాలు 20
చిన్న గ్రామ పంచాయతీలు 448

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం.. ఇందుకోసం చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.10లక్షలను సీఎం నిధుల నుంచి నేరుగా పంచాయతీలకే అందిస్తా.. ప్రజలకిచ్చిన హామీలు నేరవేర్చి గ్రామాలను అభివృద్ధి చేసుకోండి.. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 24న నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించిన నూతన సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో చేసిన ప్రకటన. దీనిపై నూతన పంచాయతీ పాలకవర్గాల్లో కొత్త ఆశలు చిగురిస్తు న్నాయి. నిధుల లేమితో సతమతమవుతున్న జీపీల్లోని సమస్యల పరిష్కారానికి కొంత వెసులుబాటు కలగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# విద్యారంగ సమస్యల పైన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ :- ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శాసనసభలో ఎమ్మెల్యే ప్రస్తావన తీసుకువచ్చి విద్యార్థులకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తా ఉన్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం విద్యార్థుల పక్షాన మొండి వైఖరిని చూపిస్తుందని అన్నారు కాబట్టి రాష్ట్రంలో చూసుకుంటే చాలా రకాల విద్యారంగ సమస్యలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయని అన్నారు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల చేస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం విద్యార్థుల పక్షాన ఈ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని అన్నారు అదేవిధంగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద విడుదల చేయాల్సిన నిధులు కూడా విడుదల చేయకుండా ప్రైమరీ విద్యార్థులు చదువులను ఎలా కొనసాగిస్తారని మండిపడ్డారు సంక్షేమ వసతి గృహాల్లో ఇప్పటివరకు దోమల తెరలు దుప్పట్లు పంపిణీ చేయకుండా నాసిరకం కూరగాయలతో కాలం వెల్లదిస్తున్నారని అన్నారు ఈ యొక్క సమస్యల పైన స్థానిక ఎమ్మెల్యే రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావన తెచ్చి విద్యారంగా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మహమ్మద్ యునస్ ఎస్ఎఫ్ఐ జిల్లా



అధ్యక్షుడు పొదల లవ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు బొమ్మిశెట్టి ఆర్య నల్ల సాత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**సామాన్యుడి అస్త్రం జనగామ** బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఉల్లెంగుల సందీప్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ను జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జనగామ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తల మధ్య ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రేమలత రెడ్డి, జనగామ పట్టణ బిఆర్ఎస్ యూత్ జనరల్ సెక్రటరీ జయా శ్రీశైలం, యూత్ నాయకులు సానిక శ్రీను, చెన్నూరి వంశీ, ఇరుగు సిద్ధులు, కన్నారపు వంశీ, నక్క రవి తదితరులు పాల్గొన్నారు.

## గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ



**సామాన్యుడి అస్త్రం జనగామ** గుడాల భూమయ్య జ్ఞాపకార్థం గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, వారి కుటుంబ సభ్యుల సహకారంతో జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ కాలనీ లో నివాసముంటున్న నిరుపేద ఆమంచి రమా కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఆమంచి రమాకు ఇద్దరు ఎదిగిన ఆడపిల్లలు ఉండగా, చిన్నప్పటి నుంచే ఆ పిల్లలు వినికిడి, మాటలు మరియు మేధస్సు సంబంధిత లోపాలతో బాధపడుతూ, సాధారణంగా మాట్లాడడం, వినడం, ఆలోచించడం చేయలేని స్థితిలో ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో వారి జీవనం మరింత కష్టతరంగా మారింది. ఈ సేవా కార్యక్రమాన్ని కాసల సంతోష్ కుమార్ నిర్వహించగా, ఫౌండేషన్ చైర్మన్ గుడాల శ్రీనివాస్ మరియు కో-చైర్మన్ వేణు శ్రీధర్ కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన చుంచు శ్రీకాంత్ కి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కుటుంబాలను ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్ ఆధ్వర్యంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సామాన్యుడి అస్త్రం జనగామ** 141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. దఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్స్ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ అన్వేష్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీ బైకని లింగం యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని, డీసీసీ కమిటీ ఏర్పాటు ప్రక్రియపై జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు ఈ సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, పేదల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిశలు పోరాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ 141 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గర్వకారణం అని తెలిపారు. పీసీసీ నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం, ఎలాంటి తారతమ్యాలు లేకుండా, పూర్తి పారదర్శకతతో, ప్రజాస్వామ్య పద్ధతిలో డీసీసీ కమిటీ ఎన్నికలు నిర్వహించబడతాయని స్పష్టం చేశారు.



అదేవిధంగా, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేసి, రాబోయే రాజకీయ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

### వైద్యం కోసం వచ్చిన వారి ఆకలి తీర్చిన పట్టూరి శ్రీను



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పట్టణానికి చెందిన పట్టూరి శ్రీను జనగామ జిల్లా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు మహా అన్న సమర్పణ చేసిన పట్టురి శ్రీను కరోనా కష్టకాలం నుండి ఎప్పుడు సమయం వచ్చినప్పుడు ప్రజలకు బియ్యం కూరగాయలు మహా అన్నదాన కార్యక్రమాలు చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారని ప్రతి ఒక్కరూ మనకు తోచినంత సందర్భం ఏదైనా కానీ ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలని తీర్చాలని భారత దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మీ మీ గ్రామ స్థాయి పట్టణా స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమంలో యువత ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు మద్దెల కార్తీక్, పల్లె హరీష్, మహమ్మద్ యాకూబ్, మహమ్మద్ అఫ్రోజ్, కొయ్యడ నాని, శ్రీను, పాకాల శ్రీచరణ్, మహమ్మద్ పాషా, వివేక్ చారి, తదితరులు పాల్గొన్నారు

# ఐక్యతే ఆయుధం అభివృద్ధే లక్ష్యం

### ఎం. బొడ్డపుట్టులో శ్రమదానంతో రచ్చబండ నిర్మాణం గ్రామ చైతన్యానికి నిదర్శనం

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** గ్రామాభివృద్ధి అంటే ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదని, ప్రజల ఐక్యతే నిజమైన బలం అని మరోసారి నిరూపించింది మఠం పంచాయతీ పరిధిలోని ఎం. బొడ్డపుట్టు గ్రామం. తరతరాలుగా గ్రామ జీవనానికి కేంద్రబిందువుగా నిలిచే రచ్చబండను గ్రామస్తులే ముందుకు వచ్చి శ్రమదానంతో నిర్మించడం అభినందనీయంగా మారింది. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి మఠం పంచాయితీ సర్పంచ్ మఠం శాంత కుమారి మార్గదర్శకత్వం వహించగా, పెసా కమిటీ ఉపాధ్యక్షులు ధనసాని రామలింగం, గ్రామ వార్డు సభ్యులు, వీఆర్పీ కొఠారి, సూరిబాబు,అల్లంగి బాలు, మాజీ సర్పంచ్, పెద్దలు, యువత సహా సమస్త గ్రామస్తులు ఏకమై భుజం భుజానికి కలిపి పనిచేశారు. పదవులు, హోదాలు పక్కనపెట్టిడ గ్రామ భవిష్యత్తే లక్ష్యంగా ఈ నిర్మాణంలో అందరూ భాగస్వాములయ్యారు. గ్రామ సమస్యలపై చర్చలకు వేదికగా, ప్రజల అభిప్రాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఈ రచ్చబండ ఇకపై గ్రామ ప్రజాస్వామ్యానికి గుండెచప్పుడు కానుంది. చిన్నపాటి ఆలోచనల నుంచే పెద్ద మార్పులు వస్తాయని, ఐక్యత



ఉంటే ఏ అభివృద్ధైనా సాధ్యమేనని ఈ రచ్చబండ నిర్మాణం చాటి చెప్పింది. ఈ సందర్భంగా సర్పంచ్ మఠం శాంత కుమారి మాట్లాడుతూ, "గ్రామాభివృద్ధి ప్రభుత్వాల మీదే ఆధారపడి ఉండకూడదు. ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ఈ రచ్చబండ మా గ్రామ ఐక్యతకు ప్రతీక" అని పేర్కొన్నారు. రచ్చబండ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్క గ్రామస్తుడికి పంచాయతీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఇదే ఐక్యత, ఇదే చైతన్యంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు.

## బచ్చన్నపేట సర్పంచ్ ఆల్వాల నర్సింగ రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**సామాన్యుడి అస్త్రం జనగామ** బచ్చన్నపేట గ్రామం ఆర్ ఎం బి గెస్ట్ హౌస్ లో శ్రీ సరోజినీ కంటి హాస్పిటల్ వారు బచ్చన్నపేట సర్పంచ్ అల్వాలా నర్సింగ రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది సర్పంచ్ నర్సింగ రావు మాట్లాడుతూ జనగామ సరోజినీ హాస్పిటల్ యాజమాన్యం కంటి పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇవ్వడం పేషంట్లకు కంటి చూపుకు సంబంధించిన జాగ్రత్తలు చెప్పడం మరియు ఈ క్యాంప్ ద్వారా 500 కు పైగా చూపించుకున్నారని తెలుపుతూ ఇలాంటూ హాస్పిటల్ వారు ముందుకొచ్చి పేదవారికి వైద్యం అందించాలని వారు కోరారు వారికీ కావలసిన సహాయ సహకారాలు అందిస్తాము అని తెలిపారు ఈ క్యాప్ పెట్టిన సరోజినీ హాస్పిటల్ వారికీ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమం లో రెండొ వార్డు సభ్యుడు కర్రె ప్రశాంత్, తొమ్మిదోవా వార్డ్ నెంబర్ దేవర కొండా మల్లేషం,ఆల్వాల స్వామి, శ్రీనివాస్, కర్రె రవికుమార్, జార్జ్, మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాడ నరేష్ ను టిఆర్పి పార్టీ లింగాల గణపురం మండల పార్టీ అధ్యక్షులుగా నియామకం



**సామాన్యుడి అస్త్రం జనగామ** తెలంగాణ రాజ్యాధికార పార్టీ, లింగాల గణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన శాడ నరేష్ ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ లింగాల గణపురం మండల పార్టీ అధ్యక్షులుగా నియమిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు జనగామ జిల్లా అధ్యక్షురాలు చెరుకూరి మౌనిక యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు, హైదరాబాద్ లో నియామక పత్రాన్ని అందజేశారు, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల నరసింహులు గౌడ్ ను నియమించడం జరిగింది అనంతరం, శాడ నరేష్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టి బిసి మైనార్టీ, హక్కుల, రిజర్వేషన్ల ,అభివృద్ధి , రాజ్యాధికారం,కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యదర్శి చిర్ర వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

## అటవీ భూమిలో అక్రమ భవన నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారు

### ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** ఆదివాసీ సంక్షేమ పరిషత్ మణుగూరు డివిజన్ అధ్యక్షుడు సోలం హరి శంకర్ ఈ రోజు ది.28-12-225 నాడు జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, మణుగూరు మండల పరిధిలోని తీర్లపురం గ్రామం, సమ్మక్కసారలమ్మ గుడి సమీపంలో ఉన్న అటవీ భూమిలో గిరిజనేతర వ్యక్తి అక్రమంగా ఇల్లు నిర్మించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని పేర్కొన్నారు. ఫారెస్ట్ భూమిలో అక్రమంగా నిర్మించిన ఈ భవనానికి గ్రామపంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వడంతో పాటు ఇంటి పన్ను కూడా విధించడం ఆశ్చర్యకరం అని ఆయన విమర్శించారు. ఇదే ప్రాంతంలో పక్కనే ఉన్న ఒక ఆదివాసికి చెందిన ఇంటి స్థలాన్ని ఫారెస్ట్ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా లాక్కోవడం జరిగింది. కానీ అదే భూమిలో గిరిజనేతరులకు ఇల్లు నిర్మించేందుకు ఎలా అనుమతులు ఇచ్చారో అధికారులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఏరియాలో ఆదివాసి చట్టాలకు పూర్తిగా విరుద్ధంగా గిరిజనేతరులు భూములు కొనడం, భవనాలు నిర్మించడం నేరం అని ఆయన గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో ఫారెస్ట్ భూమిలో గిరిజనేతరుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న అధికారుల పాత్రను వెంటనే విచారించాలని కోరారు. ఈ అంశంపై సంబంధిత రెవెన్యూ, ఫారెస్ట్, పంచాయతీ అధికారులు



తక్షణమే చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను తొలగించాలి అని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. అలాగే ఆదివాసీ భూములకు రక్షణ కల్పించి, ఆదివాసి చట్టాలను కాపాడాలని అధికారులను కోరింది. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈసం సూర్యబాబు, మణుగూరు మండలం ఉప అధ్యక్షుడు కంగల ప్రవీణ్, కార్యదర్శులు గని బోయిన రాము, గనిబోయిన నాగరాజు, అలాగే ఆదివాసి నాయకులు గోగ్గల బాలు తదితరులు పాల్గొన్నారు.

## చదువు బ్రతుక్కి బాట చూపుతుంది

### పీకే ఓసి రక్షణ అధికారి మేదూరు లింగబాబు

### శ్రీ విద్యాభ్యాస మరియు ఆరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి క్వింటాన్నర బియ్యం అందజేత



**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** చదువు బ్రతుక్కి బాట చూపుతుందనీ ఉన్నత లక్ష్యాన్ని చేరాలంటే చదువుకు మించిన మార్గం మరొకటి లేదని పీకే ఓసి రక్షణ అధికారి మేదూరు లింగబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం చీకటి వారి కొత్తగూడెం గ్రామానికి చెందిన చీకటి బ్రహ్మానందం సూర్య వర్ధనమ్మ దంపతుల ఆధ్వర్యంలో వారి కుమారుడు సర్వేష్ ఏర్పాటు చేసిన మణుగూరు శ్రీ విద్యాభ్యాస పాఠశాలకు డబ్బయి ఐదు కిలోలు మరియు అశ్వాపురం ఆరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి డబ్బయి ఐదు కిలోలు వెరసి క్వింటాన్నర బియ్యం వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దాతల సహకారంతో చదువుతోపాటు కళలు క్రీడలలో కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దాతలు చీకటి సర్వేష్ కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త సింగరేణి సేవా సమితి సభ్యులు యస్డి. నాసర్ పాషా, శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి. జగన్మోహన్ రెడ్డి, వృద్ధాశ్రమం నిర్వాహకులు షేక్ మేహారాజ్, ఐతం రాజు యాదగిరి, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## సంపాదకీయం

# టాలీవుడ్‌లో డ్రెస్సింగ్ వార్

సినిమా ఇండస్ట్రీ అన్నాక వివాదాలు కొత్తేమీ కాదు. కానీ, ఇద్దరు పాపులర్ సెలబ్రిటీల మధ్య మాటల యుద్ధం జరిగితే అది సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతుంది. రీసెంట్‌గా టాలీవుడ్ సీనియర్ హీరో, బిగ్ బాస్ ఫేమ్ శివాజీ మరియు స్టార్ యాంకర్ అనసూయ భరద్వాజ్ మధ్య జరిగిన వివాదం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది.మహిళలు, హీరోయిన్ల డ్రెస్సింగ్ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. శివాజీని కొందరు సమర్థిస్తే, కొందరు విమర్శించారు. శివాజీకి అనసూయ కూడా కౌంటర్ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలపై దీనికి ఆయన వివరణ కూడా ఇచ్చుకున్నారు. అయితే ఇది ఇంతటితో ఆగలేదు. తాజాగా అనసూయ మరో సంచలన ట్వీట్ చేసింది.'కొంతమంది పురుషులు.. ఇంకా కొంతమంది మహిళలు కూడా.. నా వయసును ఉపయోగించి నన్ను తక్కువగా చూపించడానికి.. నన్ను చిన్నగా భావింపజేయడానికి ప్రయత్నిస్తున్నారు.. ఈ విధమైన ఆలోచన కలిగిన వారు ఎక్కువగా ప్రగతిశీల మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు.. ఇది మహిళలపై నియంత్రణ కోల్పోతామన్న భయం వల్ల.. అలాగే బలహీనమైన పితృస్వామ్య అహంకారాన్ని పోషించుకోవాలనే ఉద్దేశంతో జరుగుతుంది. ఇది అందరి పురుషుల గురించీ లేదా అందరి మహిళల గురించీ కాదు. కానీ నేను పురుషులు.. మహిళలు.. అందరికీ విన్నపం చేస్తున్నాను.. దయచేసి విస్తృతంగా ఆలోచించండి. పాత తరాలు నేర్చుకున్నవి లేదా అలవాటుపడ్డ ఆలోచనలు మనం తప్పనిసరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు.మనం మార్పును ఎంచుకోవచ్చు. మన హీరోయిన్లు వేసుకొనే బట్టలు చూస్తే మనకే దరిద్రమనిపిస్తుంటుంది. హీరోయిన్లు ఏమనుకొన్నా పర్వాలేదు. మీ అందం నిండుగా కట్టుకొనే చీరలో.. నిండుగా కప్పుకొనే దుస్తుల్లోనే ఉంటుంది తప్పితే.. సామాన్లు కనపించే దుస్తుల్లో ఉండదు. మీరు అర్ధనగ్నంగా కనిపించే దుస్తులు వేసుకొన్నప్పుడు చాలా మంది మీ ముందు నవ్వుతారు. కానీ మనసులో దరిద్రపు ముండ ఇలాంటి బట్టలు ఎందుకు వేసుకొంటారు? కొంచెం మంచి బట్టలు వేసుకొంటే బాగుంటుంది కదా అని లోపల అనాలనిపిస్తుంది. ఆ మాటలు బయటకు అనలేం. స్త్రీ అంటే ప్రకృతి.. ఎంత అందంగా ఉంటే.. అంత గౌరవం పెరుగుతుంది. ప్రకృతి మాదిరిగానే మా అమ్మ సావిత్రి, సౌందర్య మాదిరిగా చక్కగా కనిపిస్తుంటుంది. గ్లామర్ ఒక దశ వరకే ఉండాలి. కానీ హద్దు మీరి ఉండకూడదు. స్వేచ్ఛ అనేది అదృష్టం. మనం వేష, భాషల వల్లే గౌరవం, స్వేచ్ఛ లభిస్తుంది. చీరకట్టు మహిళలకే విశ్వసుందరి అవార్డులు లభించాయి అని శివాజీ అన్నారు.మన గౌరవాన్ని.. మన స్వేచ్ఛను కాపాడుకోవచ్చు.. ఒకరికొకరం శక్తినివ్వాలి.. మద్దతుగా నిలవాలి.. మన విలువ మన ఎంపికల నుంచే వస్తుంది.. మరే దానితో కాదు. అంతేకాకుండా కొంతమంది మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.. మీ పని బాధ్యతతో చేయాలి.. ఈ విధమైన మహిమాపరచడం సమంజసం కాదు, అభినందనీయం కాదు.అలాగే.. జరుగుతున్న ప్రతిదానితో సంబంధం లేకుండా.. నేను ఎల్లప్పుడూ అండగా నిలుస్తాను.. బాధపడకుండా.. ప్రభావితం కాకుండా.. తాకబడకుండా.. మరియు బలంగా.. ఈ మొత్తం సంభాషణ చాలా కాలంగా వినబడని మరియు నిర్లక్ష్యం చేయబడిన సమాజంలోని ఒక వర్గాన్ని సూచించడం గురించి మాత్రమే..చివరికి నేను ఎల్లప్పుడూ అలాగే జీవిస్తాను, చెబుతాను. ఇంకొక్కటి లాస్ట్ చెప్తా ఈరోజుకి.. ఉన్న ఇష్యూ నీ అడ్రస్ చేయటం చేతగాక నా గురించి, వయసు గురించి ప్రస్తావించడం సిగ్గు చేటు. ఆంటీ అంటున్న మగవాళ్ళు, ఆడవాళ్ళు..ఆయన్ని మాత్రమే గారు అంటున్నరు.. నాకు 40, ఆయనకు 54 అనుకుంటా. పర్సనల్ గా నో ఫిట్‌నెస్ ని "గ్లామర్" ని మెయింటెయిన్ చేస్తున్నాం.. ఈ అనేవాళ్ళందరూ నిత్య యవ్వనులు అది వేరే విషయం అనుకోండి. సర్లెండి.. ఇంకా ఇంతకంటే ఏం చెప్పిన చెవిటోడి ముందు శంఖం ఊడినట్టే.. మెర్రీ క్రిస్మస్!! ఇది మరొక రోజు.. మంచి ఆహారం తీసుకోండి.. మన ప్రియమైన వారితో సంతోషకరమైన సమయాన్ని గడపండి" అని రాసుకొచ్చింది అనసూయ. మరో ఇంద్రజ మాట్లాడుతూ.. "నా బాడీ నా ఇష్టం. నాకు నచ్చిన డ్రెస్ నేను వేసుకున్నాను.. నువ్వు ఎందుకు అడుగుతున్నావు అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. కానీ నీ ఇష్టం అని పబ్లిక్ గా బట్టలు వేసుకుని రావడం.. జనాల మధ్యలో.. మీడియాలో నీ ఫోటోస్, వీడియోస్ పెట్టడం నీకు ఎంత హక్కు ఉందని నువ్వు అంటున్నావో.. న డ్రెస్సింగ్ అభ్యంతకరంగా.. చీప్ గా ఉన్నప్పుడు దాని గురించి అడిగే హక్కు కూడా ఎదుటివారికి ఉంటుంది. పబ్లిక్ లో ఇలా ఉండాలని ఒకటి ఉంటుంది. ఇంట్లో ఉన్నట్లు.. ఇంట్లో మాట్లాడినట్లు బయట ఉంటాను అంటే కుదరదు. పబ్లిక్ లో ఎలా ఉండాలి అనేది ఒక కోడ్ ఉంటుంది. అది నీ ఇష్టం నేను వేసుకుంటాను అంటే.. ఓకే కానీ.. వేసుకున్నాక కామెంట్స్ చేయొద్దు అనే రైట్స్ మాత్రం నీకు లేవు" అని అన్నారు"అసభ్యకరమైన బట్టలు మీ పబ్లిక్ లో కాదు.. మీ పర్సనల్ ప్లేస్ లో వేసుకోండి.. పబ్లిక్ లో వేస్తే అలాగే కామెంట్స్ చేస్తారు. అన్నింటినీ భరిస్తేనే బయట అలాండి డ్రెస్సింగ్ వేసుకోండి. లేదంటే వేసుకోవద్దు. కొందరి డ్రెస్సింగ్ చూస్తే ఇవేమి డ్రెస్సులు అనిపిస్తుంది. అలాంటి కాస్ట్యూమ్స్ తో ఎలా కంఫర్ట్ గా ఉంటారు అనిపిస్తుంది. అందంగా ఉండాలి.. ట్రెండింగ్ గా ఉండాలి. కానీ ఛీ అనేలా ఉండకూడదు. సెలబ్రిటీలు ఈ విషయంలో స్ట్రిక్ట్ గా ఉండాలి. మిమ్మల్ని చూసి ఫాలో అయ్యేవాళ్ళు ఉన్నారు కాబట్టి. మనల్నీ ట్రీట్ చేసే విధానం బట్టల్లో కూడా ఉంటుంది "అని అన్నారు.

# భారత శిక్షాస్మృతి సృష్టికర్త

లార్డ్ మెకాలే.. ఈ పేరు వినగానే వెంటనే స్ఫురణకు వచ్చేది భారత దేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేసిన వ్యక్తి. కానీ చాలా మందికి తెలియని విషయం...మెకాలే భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ 1860) సృష్టికర్త అని. ఆయన లా కమిషన్ ఛైర్మన్‌గా నేటికీ చెక్కుచెదరని మూల రూపం గల ఐపిసి చిత్తు ప్రతి తయారు చేయబడిందని. 19వ శతాబ్దపు కవి, చరిత్రకారుడు, రాజనీతివేత్త, లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (1800 అక్టోబరు 25..1859 డిసెంబర్ 28) వర్ధంతి సందర్భంగా, ఇండియన్ పీనల్ కోడ్ పూర్వా పరాలను తెలుసుకుందాం. 1830కి ముందు, భారతదేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్లు.. బొంబాయి, కలకత్తా, మద్రాసులలో అమలు జరిగేది. లార్డ్ మెకాలే, నాటి "ఫ్రెంచి పీనల్ కోడ్", "లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా" అనే రెండు ప్రామాణిక గ్రంథాలను ఆదర్శంగా తీసు కుని, ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తుప్రతి'ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతిని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసుకున్నాడు. శిక్షల విషయంలో, ఆనాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆచార వ్యవహారాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్-కౌన్సిల్‌కి నివేదించినా,1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. లార్డ్ మెకాలే తయారుచేసిన 'చిత్తు ప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘంగా, పరిశీ లించి, పరీక్షించాడు. అయన సుదీర్ఘ పరిశీలన తర్వాత ఇండి యన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన 45వ చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలులోకి వచ్చింది. మొట్ట మొదటి ఇండియన్ పీనల్



కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమాయిషీలో జరి గింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే). మొదటి ఇండియన్ పీనల్‌కోడ్ 1862 సంవత్సరంలో, అమలులోకి వచ్చింది. నాటినుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాలలోను,విద్యాపరంగా, వైజ్ఞానికంగా, అనేక రంగాలలో,అనేక రకాలుగా జరిగిన సమస్తమైన మార్పుల ప్రాతిపదికగా భారతీయ శిక్షాస్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది.అందుకు గృహ హింస సెక్షన్ 498-ఎ ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. మన భారతీయ శిక్షాస్మృతి లో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం చట్టాలు మరో ఉదాహరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షాస్మృతిలో లేవు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు "పాకిస్తాన్ పీనల్ కోడ్" (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా "బంగ్లాదేస్ పీనల్ కోడ్" పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక(నాటి సిలోన్), మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా అమలు చేస్తున్నాయి. ఇండియన్ పీనల్‌కోడ్ జమ్ముకాశ్మీర్లో కూడా అమలులో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. "రన్‌బీర్ పీనల్ కోడ్" (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే, 1859 డిసెంబరు 28న, తన 59వ ఏట, మరణించిన క్రమంలో తన కృషి సాకారమై , చట్టమై, అమలు జరగటం చూడనే లేదు.నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయశాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. 161 ఏళ్లల్లో మార్పులు ఎన్ని వచ్చినా, శిక్షాస్మృతి చెక్కు చెదరకుండా ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి అమోఘం. మేధస్సు అద్భుతం. ఆయన కృషి అనితర సాధ్యం.

# కళాశాలలు, పరీక్షలు ఉన్నా... ఉన్నత విద్యాభ్యసనం ఎక్కడ!

తెలంగాణలో ఉన్నత విద్యా వ్యవస్థ మౌనంగా క్షీణిస్తోంది. బయటకు కళాశాలలు నడుస్తున్నట్టే కనిపిస్తున్నా, లోపల విద్య అనే ఆత్మ నెమ్మదిగా నశిస్తోంది. తరగతులు ఉన్నా బోధన లేదు, అరకొర అధ్యాపకులు ఉన్నా మార్గనిర్దేశం లేదు, విద్యార్థులు ఉన్నా నిజమైన అభ్యసనం కనిపించడం లేదు. 'పుస్తకాలు' ఉండాల్సిన చేతుల్లో 'సెల్‌ఫోన్లు' కనిపిస్తున్నా, కళాశాలలకు వెళ్లకపోయినా తల్లిదండ్రుల నుంచి వ్యవస్థ వరకు ఎవరికీ పట్టడం లేదు. తరగతులు జరగకపోయినా వ్యవస్థ స్పందించకపోవడం ఈ మౌన నిర్లక్ష్యాన్ని మరింత పెంచుతోంది. ఫలితంగా విద్యాసంవత్సరం మొత్తం సమర్థవంతమైన అభ్యసనం లేకుండానే విద్యార్థులు పరీక్షలకు నామమాత్రంగా హాజరవుతున్నారు. సరైన ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో చూచిరాతలు, మాస్ కాపీయింగ్, ఇతర అక్రమ మార్గాల వైపు తోసుకుపోతున్నారు. తరగతులు, అధ్యాపకులు, ప్రయోగశాలలు, జ్ఞానం, క్రమశిక్షణ, మేధో వికాసం వంటి మూల స్తంభాలు కూలిపోతూ ఉన్నత విద్య కేవలం 'పట్టా పొందే యాంత్రిక ప్రక్రియ'గా మారుతోంది. విద్య అనే ఆయుధం ఇవ్వాల్సిన వ్యవస్థ, ఖాళీ చేతులతోనే విద్యార్థులను పోటీ ప్రపంచంలోకి తోసేస్తోంది. ఈ దిగజారుదల ఒక్క కళాశాలకో విభాగానికో పరిమితం కాకుండా, ఇంజనీరింగ్ నుంచి డిగ్రీ, నర్సింగ్ నుంచి లా వరకు మొత్తం వ్యవస్థనే నిర్వీర్యం చేస్తోంది. ఎవ్వరూ ప్రత్యక్షంగా బాధ్యత వహించని ఈ వ్యవస్థే పరోక్షంగా భ్రష్టుపడుతున్న తతంగం. ఇది విద్యా సమస్య మాత్రమే కాదు, ఒక తరం భవిష్యత్తును ప్రశ్నార్థకంగా నిలబెట్టే ప్రమాదకర సంకేతం. ఇంజనీరింగ్ నుంచి డిగ్రీ, పీజీ, నర్సింగ్, ఫార్మసీ, వృత్తివిద్య, లా కళాశాలల వరకు రాష్ట్రంలో విద్యా దుస్థితి విస్తరించింది. అనేక ప్రైవేట్ కళాశాలలు వంటి నియంత్రణ సంస్థల నిబంధనలను తూతూ మంత్రంగా పాటిస్తూ, పూర్తి స్థాయి అధ్యాపకుల నియామకాన్ని తప్పించుకుంటున్నాయి. విద్యార్థులు తరగతులకు రాకపోవడమే మంచిదన్న మౌన అంగీకారంతో, ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కళాశాలల నిర్వహణ సాగుతోంది. తరగతులు లేకున్నా కళాశాలలు నడుస్తున్నాయి. అధ్యాపకులు లేకున్నా గుర్తింపులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, విశ్వవిద్యాలయాల పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణం. అనుమతుల విషయంలో చూపే చురుకుదనం, క్షేత్రస్థాయి తనిఖీల్లో మాత్రం కనిపించడం లేదు. విద్యాసంవత్సరం మొత్తం తరగతులు జరుగుతున్నాయా, అధ్యాపకులు హాజరవుతున్నారా, విద్యార్థులు తరగతులకు వస్తున్నారా అన్న ప్రాథమిక అంశాలపైనా పర్యవేక్షణ లేదు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విద్యా సంవత్సరం మొత్తం పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరగతులకు హాజరు కావడం లేదు. థియరీ పాఠాలు, ప్రయోగశాల అనుభవం లేకుండానే విద్యా సంవత్సరాలు గడుస్తున్నాయి. ఫలితంగా జ్ఞానం, వ్యక్తిత్వం, నైపుణ్యాలు అభివృద్ధి చెందడం లేదు. దిశానిర్దేశం లేని చదువు పరీక్షలను చూచిరాతల వైపు నడిపిస్తూ, సెమిస్టర్, వార్షిక పరీక్షలకు తరగతుల్లో నేర్చుకున్న



పరిజ్ఞానం లేకుండానే నామమాత్రంగా హాజరవుతున్నారు. ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో చూచిరాతలు, మాస్ కాపీయింగ్, అక్రమ మార్గాలు సాధారణమవుతున్నాయి. ఇది విద్యార్థుల తప్పు మాత్రమే కాదు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, కొందరు అధ్యాపకులు కూడా ఈ అక్రమాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రోత్సహించడం ఆందోళన కలిగించే విషయం. "పట్టా వస్తే చాలు" అంటున్న తల్లిదండ్రులు, సమాజం మౌన ధోరణి ఈ దిగజారుదలకి బలం ఇస్తోంది. ఫలితంగా నైపుణ్యాలు, పరిశోధనా పరిజ్ఞానం లేని పట్టభద్రులు తయారవుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. తరగతులకు వెళ్లకుండానే నేరుగా పరీక్షలకు హాజరయ్యే వారి సంఖ్య పెరగడంతో, జ్ఞానాన్ని పరీక్షించాల్సిన పరీక్షలే 'జవాబులు చూసి రాయగలిగితే చాలు' అనే స్థాయికి దిగజారాయి. ఇందులో ఏమి కోల్పోతున్నామో విద్యార్థులు, కళాశాలలు, సమాజం మొత్తం గ్రహించలేని స్థితి నెలకొంది. నేటి రోజుల్లో విద్యార్థులు పుస్తకాలతో అనుబంధాన్ని కోల్పోయి, చదవాల్సిన చేతుల్లో గంటల తరబడి సెల్‌ఫోన్‌లే కనిపిస్తున్నాయి. విద్యకు ద్వారంగా మారాల్సిన సాంకేతికత, నేడు విద్యార్థులను విపరీత ధోరణుల వైపు నడిపించే సాధనంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అవసరం లేని కంటెంట్‌లో విలువైన సమయాన్ని వృథా చేయడం వల్ల చదువుపై ఆసక్తి తగ్గి, రెగ్యులర్‌గా కళాశాలలకు వెళ్లి తరగతులు వినాలన్న ఉత్సాహం క్రమంగా క్షీణిస్తోంది. ఫలితంగా ప్రత్యక్ష అభ్యసనం, అధ్యాపకుల మార్గనిర్దేశం ద్వారా పొందాల్సిన జ్ఞానం విద్యార్థుల జీవితాల నుంచి దూరమవుతోంది. ఈ నిర్లక్ష్యం కొందరిని మత్తు పదార్థాలు, డ్రగ్స్ వైపు నెట్టేస్తూ, చదువుకే కాదు జీవితానికే దారి తప్పే ప్రమాదాన్ని పెంచుతోంది. ఇది వ్యక్తిగత సమస్య కాదు, రాబోయే తరానికి సంబంధించిన సామాజిక సంక్షోభం. విద్యార్థులనే నిందించడం సరికాదు. ((తల్లిదండ్రులు, కళాశాలలు, ప్రభుత్వం, సమాజం కలిసి సెల్‌ఫోన్ వినియోగంపై నియంత్రణతో పాటు ప్రత్యక్ష విద్యకు ప్రాధాన్యం, క్రమశిక్షణతో కూడిన అకడమిక్ వాతావరణాన్ని తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.) స్కాలర్‌షిప్ ద్వారా ఫీజు రీయంబర్స్మెంట్‌ను ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆలస్యం చేయడం మరో కీలక సమస్య. దీని వల్ల నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. అదే సమయంలో, ఈ ఆలస్యాలను సాకుగా చూపుతూ కళాశాలలు బోధన నాణ్యతను తగ్గించడం మరింత ఆందోళనకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం, కళాశాలల బాధ్యతాహీనత మధ్య విద్యార్థుల భవిష్యత్తే నలిగిపోతోంది. కనీసం 75 శాతం హాజరు లేకుండా వార్షిక పరీక్షలకు మినహాయింపులు ఇవ్వకుండా, నిబంధనలను పరీక్ష ఫీజు, స్కాలర్‌షిప్‌ల కింద మెస్ ఛార్జీలు, ఫీజు రీయంబర్స్మెంట్ విడుదలతో అనుసంధానం చేయాలి. అదే సమయంలో ప్రభుత్వం విద్యార్థి సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని ఆర్థిక ప్రోత్సాహకాలను నిర్దిష్ట కాలపరిమితిలో విడుదల చేయాల్సిన బాధ్యతను వహించాలి. లేకపోతే ఫీజు భారం నేరుగా తల్లిదండ్రులపై పడుతూ, నిరుపేద కుటుంబాలను కఠిన నిర్ణయాలకు నెట్టే పరిస్థితి ఏర్పడు తుంది. ఈ కోణాన్ని విద్యా విధానాల్లో విస్మరించకూడదు.



# నిద్రలేవగానే మానసిక గందరగోళం ఇలా ఎందుకు జరుగుతుంది?

పొద్దు పొద్దున్న బ్యాడ్ మూడ్‌తో నిద్రలేస్తున్నారా? ఏదో తెలియని నిరాశ, నిస్పృహ, మానసిక ఆందోళన, గందరగోళం వెంటాడుతున్నాయా?.. ఇలాంటి సమస్యకు కారణం మీరే కావచ్చునేమో ఒకసారి ఆలోచించండి. ఎందుకంటే.. ముందురోజు రాత్రి నిద్రకు ముందు మీరు తీసుకునే ఆహారం, పానీయాలు, అలాగే అతి ఆలోచనలు మరుసటిరోజు మిమ్మల్ని బ్యాడ్ మూడ్‌తో మేల్కొనేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఇటీవల అనేకమంది ఎదుర్కొంటున్న రొటీన్ ప్రాబ్లమ్ ఇది. నిద్ర మేల్కొన్నప్పటికీ ముఖంలో కోపం, ఆవేదన, స్ట్రెస్ వంటి ఏదో ఒక లక్షణం కనిపిస్తుంది. ఇలా అప్పుడప్పుడైతే పర్లేదు కానీ.. తరచూ అదే జరుగుతుంటే మాత్రం మీ ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాకుండా రోజువారి పనికి, వృత్తి జీవితానికి ఆటంకం కలుగుతుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు సరైన భోజనం తీసుకోకపోవడం మరుసటి రోజు ఉదయం మీరు బ్యాడ్‌గా నిద్రమేల్కొనేలా చేస్తుంది. కొందరికి రాత్రి భోజనం తర్వాత స్వీట్లు, చిప్స్, ఇతర చిరుతిళ్లు తినే అలవాటు ఉంటుంది. ఇలా తినడాన్ని ఇంట్లో వాళ్లు వ్యతిరేకిస్తారనే కారణంతో కొందరు ఎలాగైనా తినాలని సాకులు వెతుకుతుంటారు. తాము తిని చాలా రోజులైందని, కాబట్టి ఇప్పుడు తింటే ఏం కాదని చెప్తుంటారు. కొందరు అలా తినడంవల్ల తమ బాధలు పోతాయని, రిలాక్స్ అవుతామని అంటుంటారు. కానీ ఇది నిజం కాదు. రాత్రిళ్లు భోజనం తర్వాత అదనంగా ఆహారం, స్వీట్లు, చిప్స్, పిస్తా, పిజ్జా వంటివి తీసుకో కూడదని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఇవి అధిక మోతాదులో కార్బోహైడ్రేట్లు కలిగిన ఇతర ఆహారాలు. పడుకునే ముందు తినడంవల్ల నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. కానీ మరుసటిరోజు మీ మూడ్ పాడు చేస్తాయి. కోపంతో మేల్కొనేలా చేస్తాయి. న్యూట్రిషనల్ థెరపిస్ట్ జాకీ లించ్ ప్రకారం.. ఇలాంటి ఆహారాలు మీ రక్తంలో షుగర్ లెవల్స్‌ను హెచ్చుతగ్గులకు గురిచేస్తాయి. ఫైనల్‌గా నిద్రపోయే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే నిద్ర పోయేకంటే ముందు కనీసం 3 నుంచి 4 గంటల ముందు తింటే అంత ప్రభావం ఉండకపోవచ్చు. మీరు బ్యాడ్ మూడ్‌లో మేల్కొన్నప్పుడు, ఆ కోపాన్ని మీ కడుపుపై చూపొద్దు. అంటే బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండా ఉండకండి. మీరు ఏ విధమైన ఆహారం తీసుకున్నా సరే.. బ్రేక్ ఫాస్ట్ అనేది చాలా ముఖ్యం. మూడ్ బాగోలేదని దానిని స్కిప్ చేస్తుంటే గనుక మీరు నిరాశ, ఆందోళనలను ఆహ్వానించినట్టే లెక్క. లైట్ అండ్ హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ తక్షణమే మీ రోజువారి మానసిక స్థితిని ఆనందమయం చేస్తుంది. మీకు కోపంగా అనిపించినప్పుడు ఎందుకలా అనిపిస్తుందనేది నిర్ధారించుకోండి. కొంచెం అల్పాహారం తినండి, ఆ తర్వాత ఎలా అనిపిస్తుందో చూడండి. తినకుండా ఉండటం అనేది మరుసటిరోజు మీ మూడ్ పాడవడానికి కారణం అవుతుంది. ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ చేసేందుకు ట్రై చేసినవారు ఆరోజంతా చాలా మంచి అనుభూతి చెందుతారు. బోనస్ చిట్కా ఏటంటే.. మీరు తీసుకునే బ్రేక్ ఫాస్ట్‌లో తగిన ప్రోటీన్‌ను కలిగి ఉండటం. ఎందుకంటే ఇది బరువు తగ్గడానికి, ఎనర్జీ కోసం సహాయపడుతుంది. మీరెప్పుడైనా నిద్రలేని రాత్రులు గడిపారా? ఎలాగైనా నిద్రపోవాలని ప్రయత్నంలో భాగంగా కళ్లు మూసుకుంటారు. కానీ కునుకు రాదు. రకరకాల ఆలోచనలు వెంటాడుతుంటాయి. అయితే ఎందుకు అలా జరుగుతుందో మాత్రం చాలామంది పట్టించుకోరు. మీరు మరుసటి రోజు బ్యాడ్ మూడ్‌తో నిద్ర మేల్కొనడానికి ఇది కూడా ఒక కారణమే అంటున్నారు నిపుణులు. పడుకునే ముందు రోటీన్‌కు భిన్నమైన జీవనశైలి, ఎక్కువసేపు స్క్రీన్ చూడటం, ఫోన్‌లో నిమగ్నమైపోవడం, జంక్ లేదా ఆయిలీ ఫుడ్స్ తినడం వంటి కారణాలతో ఇటువంటి సమస్య తలెత్తుతుంది. కాబట్టి వాటిని నివారించాలి. నిద్రపోయే సమయాన్ని ఆందోళన కరంగా ఉండకుండా చూసుకోవాలి. ప్రశాంతమైన వాతావరణం క్రియేట్ చేసుకోవాలి అంటున్నారు నిపుణులు.

## 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలుతుందా?




వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు. వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు జుట్టు రాలుతుంది? అనే విషయాల గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? మాక్స్ హాస్పిటల్‌లోని డెర్మటాలజీ విభాగంకి చెందిన డాక్టర్ సౌమ్య సచ్‌దేవా దీని గురించి మాట్లాడుతూ.. 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉన్నాయి. కొంతమంది మహిళలు ఈ వయసులో మెనోపాజ్‌కు గురవుతారు. ఇది కూడా ఒక కారణం. అంతేకాకుండా అనేక హార్మోన్ల లోపాలు కూడా దీనికి కారణం కావచ్చు. మహిళలకు ఐరన్, విటమిన్ డి, బయోటిన్ లోపం ఉన్నా జుట్టు రాలడం సంభవించవచ్చు. మహిళల్లో జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడి కూడా ఒక ప్రధాన కారణమని డాక్టర్ సౌమ్య అంటున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మానసిక ఒత్తిడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి జుట్టును కూడా ప్రభావితం చేస్తాయి. జుట్టు పెరుగుదలను అడ్డుకుంటాయి. జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా జుట్టు రాలడానికి కారణమవుతాయి. ఈ వ్యాధులకు చికిత్స లేదు. కొంతమంది మహిళల్లో థైరాయిడ్ లేదా డయాబెటిస్ వల్ల కూడా జుట్టు రాలడం సంభవించవచ్చు. ఇలాంటి సందర్భాలలో థైరాయిడ్, డయాబెటిస్‌ను నియంత్రించడం వల్ల కూడా జుట్టు రాలడాన్ని నియంత్రించవచ్చు. మహిళకు ఆటో ఇమ్యూన్ వ్యాధి లేదా జన్యుపరమైన కారణాల వల్ల జుట్టు రాలడం జరిగితే దానిని పూర్తిగా నియంత్రించడం కష్టం. ఇతర సందర్భాల్లో కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ప్రోటీన్, ఐరన్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.జుట్టు పెరుగుదలకు పుట్టగొడుగులు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి.నీళ్లు పుష్కలంగా తాగాలి. మానసిక ఒత్తిడిని నివారించాలి. దానిని నివారించడానికి ప్రతిరోజూ యోగా సాధన చేయాలి.మీ తలకు క్రమం తప్పకుండా మసాజ్ చేసుకోవాలి.

## మెదడు చురుగ్గా పనిచేయాలంటే...



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది పిల్లలు అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండటం, ఉదయం ఆలస్యంగా నిద్ర లేవటం అలవాటు చేసుకుంటున్నారు. ఇలాంటి అస్తవ్యస్తమైన నిద్ర వేళల వల్ల పిల్లల శారీరక ఎదుగుదలపై ప్రభావం పడటమే కాకుండా, వారిలో చికాకు కూడా పెరుగుతుంది. అందుకే ప్రతిరోజూ పిల్లలు ఒకే నిర్ణీత సమయానికి నిద్రపోయేలా, మళ్ళీ ఉదయాన్నే ఒకే సమయానికి నిద్రలేచేలా క్రమశిక్షణ అలవాటు చేయాలి. క్రమం తప్పకుండా ఒకే వేళకు నిద్రపోవడం వల్ల శరీరంలోని జీవక్రియలు సక్రమంగా పనిచేస్తాయి. రాత్రిపూట తగినంత సమయం గాఢ నిద్రపోవడం వల్ల పిల్లల మెదడు ఎంతో చురుకుగా మారుతుంది. సరైన నిద్ర ఉన్నప్పుడే వారు పగటిపూట చదువుల్లో మరియు ఇతర ఆటపాటల్లో ఏకాగ్రతను ప్రదర్శించగలుగుతారు. నిద్రలో మెదడు కణాలు పునరుజ్జీవనం పొందుతాయి, ఇది వారి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుంది. కాబట్టి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం నిద్ర విషయంలో అస్సలు రాజీ పడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నేటి కాలంలో పిల్లలు నిద్రపోవడానికి ముందు టీవీ చూడటం లేదా మొబైల్ ఫోన్‌లలో గేమ్స్ ఆడటం వ్యసనంగా మార్చుకుంటున్నారు. ఈ అలవాటు వారి కళ్ళపై ఒత్తిడి పెంచడమే కాకుండా, మెదడును ఉత్తేజితం చేసి నిద్ర రాకుండా చేస్తుంది. అందుకే పడుకునే కనీసం గంట ముందు నుంచి డిజిటల్ పరికరాలకు వారిని దూరంగా ఉంచాలి. వాటికి బదులుగా పిల్లలకు ఆసక్తి కలిగించే నీతి కథలు లేదా జందమామ కథలు చెప్పడం ద్వారా వారు మానసిక ప్రశాంతత పొంది త్వరగా నిద్రలోకి జారుకుంటారు. పిల్లలు హాయిగా నిద్రపోవాలంటే వారు పడుకునే గది వాతావరణం కూడా ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. నిద్రపుచ్చే సమయంలో గదిలో వెలుతురు తక్కువగా ఉంటూ, ప్రశాంతమైన వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. గదిలో ఎక్కువ శబ్దాలు లేకుండా నిశ్శబ్దంగా ఉంటే పిల్లలు ఎటువంటి ఆటంకం లేకుండా గాఢ నిద్రపోతారు. ఆహ్లాదకరమైన వాతావరణం మరియు తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉంటే పిల్లల నిద్ర అలవాట్లు మెరుగుపడి వారు ఆరోగ్యంగా పెరుగుతారు.

## హనీమూన్ పాత మోడల్.. ఇప్పుడు నడుస్తోంది 'మినిమూన్' ట్రెండ్!



పెళ్లి అనగానే మనకు గుర్తొచ్చేది బంధుమిత్రుల సందడి, భోజనాలు, ఫోటో షూట్‌లు. వీటన్నింటి తర్వాత కొత్త జంట ఎంతో ఆశగా ఎదురుచూసేది హనీమూన్ కోసం. ఒకప్పుడు హనీమూన్ అంటే కనీసం వారం పది రోజుల పాటు విదేశాలకో లేదా సుదూర ప్రాంతాలకో వెళ్లడం ఆచారంగా . పెళ్లి అనగానే మనకు గుర్తొచ్చేది బంధుమిత్రుల సందడి, భోజనాలు, ఫోటో షూట్‌లు. వీటన్నింటి తర్వాత కొత్త జంట ఎంతో ఆశగా ఎదురుచూసేది హనీమూన్ కోసం. ఒకప్పుడు హనీమూన్ అంటే కనీసం వారం పది రోజుల పాటు విదేశాలకో లేదా సుదూర ప్రాంతాలకో వెళ్లడం ఆచారంగా ఉండేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. నేటి తరం జంటలు సుదీర్ఘమైన హనీమూన్ కంటే 'మినిమూన్' వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అసలు ఈ మినిమూన్ అంటే ఏంటి? దీనికి ఎందుకంత క్రేజ్ పెరుగుతోంది?

మినిమూన్ అంటే పెళ్లి అయిన వెంటనే కేవలం రెండు లేదా మూడు రోజుల పాటు దగ్గర్లోని ఏదైనా ప్రశాంతమైన ప్రదేశానికి వెళ్లడం. అంటే ఒక లాంగ్ వీకెండ్ ట్రిప్ లాంటిదన్నమాట. భారీ హనీమూన్ ప్లాన్‌ను భవిష్యత్తు కోసం వాయిదా వేసి, ప్రస్తుతానికి పెళ్లి అలసట నుంచి ఉపశమనం పొందేందుకు ఈ చిన్న ప్రయాణాలను ఎంచుకుంటున్నారు. ఇది కేవలం మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఒక పాపులర్ ట్రెండ్‌గా మారుతోంది. కొత్త జంటలు మినిమూన్ వైపు వెళ్లడానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి.మొదటిది సమయం, పెళ్లి పనుల కోసం ఇప్పటికే ఆఫీసుల నుంచి చాలా రోజులు సెలవులు తీసుకుంటారు. మళ్ళీ హనీమూన్ కోసం రెండు వారాల సెలవు దొరకడం కష్టమవుతోంది. అందుకే పెళ్లి తర్వాత దొరికిన రెండు రోజుల్లోనే ఒక చిన్న ట్రిప్ వేస్తున్నారు. రెండవది బడ్జెట్, పెళ్లి ఖర్చుల వల్ల ఆర్థికంగా కొంత భారం పడవచ్చు.అలాంటి సమయంలో ఖరీదైన అంతర్జాతీయ హనీమూన్ కంటే తక్కువ ఖర్చుతో అయ్యే మినిమూన్ బెస్ట్ ఆప్షన్ అని భావిస్తున్నారు. మూడవది రిలాక్సేషన్, పెళ్లి హడావుడిలో కొత్త జంట విపరీతంగా అలసిపోతారు. ఆ సమయంలో సుదూర ప్రయాణాలు చేయడం కంటే దగ్గర్లోని రిసార్ట్‌లో ప్రశాంతంగా గడపడం వారికి నచ్చుతోంది. మినిమూన్ వెళ్లేవారు హనీమూన్ క్యాన్సిల్ చేసుకుంటారని కాదు. పెళ్లి తర్వాత వెంటనే ఒక చిన్న ట్రిప్ వేసి, ఆ తర్వాత ఆరు నెలలకు లేదా ఏడాదికి ఒకసారి తీరిక చూసుకుని పెద్ద హనీమూన్‌కు వెళ్తున్నారు. దీనిని 'మెగా మూన్' అని పిలుస్తున్నారు. దీనివల్ల ఆర్థికంగా ప్లాన్ చేసుకోవడానికి, సెలవులు సర్దుబాటు చేసుకోవడానికి వీలుంటుంది. ముఖ్యంగా ఈ మినిమూన్ కోసం విలాసవంతమైన హోటళ్లు, స్టేకేషన్లు, ప్రైవేట్ విల్లాలను జంటలు ఇష్టపడుతున్నారు. మొత్తానికి హనీమూన్ అంటే కేవలం తిరగడం మాత్రమే కాదు, ఇద్దరి మధ్య బంధాన్ని బలోపేతం చేసుకోవడమే అసలు ఉద్దేశం. అది పది రోజుల ట్రిప్ అయినా లేదా రెండు రోజుల మినిమూన్ అయినా.. ఆ క్షణాలను ఎలా ఎంజాయ్ చేస్తున్నామన్నదే ముఖ్యం!



# అఖిల్ ‘లెనిన్’పై కీలక అప్‌డేట్.. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్?

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా ‘లెనిన్’ పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘వినరో భాగ్యం విష్ణుకథ’ ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తోనే అఖిల్ ఈ సినిమాలో విభిన్నమైన మాస్ పాత్రలో కనిపించబోతున్నాడని క్లారిటీ ఇచ్చారు మేకర్స్. అయితే ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో షూటింగ్ స్టేటస్, రిలీజ్ టైమ్‌లైన్‌పై అభిమానుల్లో సందేహాలు నెలకొన్నాయి. సోషల్ మీడియాలోనూ ఏదొక అప్‌డేట్ ఇవ్వాలని అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. అడగకుండానే మాట్లాడిన ఆయన, మరికొద్ది రోజుల్లోనే ‘లెనిన్’ ఫస్ట్ సింగిల్ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు. అంతేకాదు, సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని, వచ్చే ఏడాది మార్చిలో మూవీని విడుదల చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.నాగవంశీ వ్యాఖ్యలతో అక్కినేని అభిమానుల్లో జోష్ పెరిగిపోయింది. నిర్మాత మాటల్ని బట్టి చూస్తే అఖిల్ కెరీర్‌లో ఇదే ఫస్ట్ బ్లాక్‌బస్టర్ అవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని అంచనాలు వినిపిస్తున్నాయి. మరి ఈ రెండు మూడు రోజుల్లో ‘లెనిన్’కు సంబంధించిన అధికారిక ప్రకటన వస్తుందా? అఖిల్ నుంచి మాస్ సర్ప్రైజ్ ఎప్పుడు వస్తుందో చూడాలి. కాగా, అఖిల్ కెరియర్‌లో ఇప్పటి వరకు మంచి హిట్ ఒక్కటి లేదు. పెళ్లి తర్వాత అఖిల్ నుండి వస్తున్న తొలి చిత్రం ఇదే కాగా, ఈ మూవీతో మనోడు మంచి హిట్ దక్కించుకుంటాడా, అక్కినేని ఫ్యాన్స్‌కి న్యూ ఇయర్‌లో మంచి ట్రీట్ ఇస్తాడా అనేది చూడాలి.

# అద్భుతమైన కంటెంట్‌తో ‘ఓ అందాల రాక్షసి’ స్టోరీ



దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన ‘ఓ అందాల రాక్షసి’ అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా తెరకెక్కించిన ఈ మూవీ జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. షెరాజ్ మెహదీ మాట్లాడుతూ .. “ఓ అందాల రాక్షసి’ మూవీని జనవరి 2న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాను. కొత్త ఏడాదిలో ఓ మంచి సినిమా వస్తుంది. ఈ మూవీలో కృతి వర్మ, విహాన్షి హెగ్డే, నేహా దేశ్ పాండే, అఖిల, గీతా రెడ్డి, స్నేహా, ప్రియా దేశ్ పాల్, సుమన్ గారు, తమ్మారెడ్డి భరద్వాజ్ ఇలా చాలా మంది అద్భుతమైన పాత్రల్ని పోషించారు. మంచి కంటెంట్‌తో రాబోతోన్న ఈ సినిమా ఆడియెన్స్‌కి ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టదు. సందేశాత్మక కథతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇందులోని ట్విస్ట్‌లు అద్భుతంగా ఉంటాయి. అమ్మాయిలకు నచ్చే చిత్రం అవుతుంది’ అని అన్నారు. కథ, మాటల రచయిత భాష్య శ్రీ మాట్లాడుతూ .. “ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథను, మాటల్ని రాశాను. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఓ మంచి ఫీల్‌తో బయటకు వస్తారు. నేటి తరం ఆడపిల్లలు ఎలా ఉండాలనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని చేశాం. మా హీరో షెరాజ్ అద్భుతంగా నటించారు. డైరెక్టర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా, హీరోగా ఇందులో మ్యాజిక్ చేశారు. కృతి వర్మ హిందీలో చాలా ఫేమస్. విహాన్షి చాలా అద్భుతంగా నటించారు. ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది. జనవరి 2న ఈ మూవీని అందరూ చూడండి’ అని అన్నారు.



# యశ్ టాక్సిక్‌లో మరో హాట్ బ్యూటీ.. ఎలిజబెత్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్

‘రాకింగ్ స్టార్’ యశ్ నటిస్తున్న ‘టాక్సిక్’ సినిమాలో చాలా మంది ఆర్టిస్టులు నటిస్తున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా రోజులు మిగిలి ఉంది. అయితే ప్రమోషన్లు మాత్రం విస్తృతంగా చేస్తున్నారు. ఈ సినిమాలోని నటీనటుల పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తున్నారు. యష్ తో పాటు , ఈ సినిమాలో చాలా మంది ప్రముఖ ఆర్టిస్టులు నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి తదితర స్టార్స్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో భాగం కానున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి హుమా ఖురేషి పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ‘టాక్సిక్’ సినిమాలో ఎలిజబెత్ పాత్రలో హుమా ఖురేషి నటిస్తోంది. పేరుకు తగ్గట్టుగానే ఈ పాత్ర చాలా రిచ్ గా ఉంది. గ్లామరస్ డ్రెస్ వేసుకుని రెట్రో లగ్జరీ కారు ముందు నిలబడి ఉన్న హుమా ఖురేషి లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది చూసిన తర్వాత ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

‘టాక్సిక్’ సినిమాను కన్నడ, ఇంగ్లీషు భాషల్లో ఒకేసారి నిర్మిస్తున్నారు. దీనిని ఇతర భాషల్లోకి డబ్ చేస్తున్నారు. ‘కె.వి.ఎన్. ప్రొడక్షన్స్’ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. యష్, నయనతార, కియారా అద్వానీ, అక్షయ్ ఒబెరాయ్, తారా సుతారియా, టోవినో థామస్, రుక్మిణి వసంత్ తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం నటి కియారా అద్వానీ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ సినిమాలో ఆమె నదియా పాత్రను పోషిస్తోంది. గీతు మోహన్‌దాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత యష్ అంగీకరించిన సినిమా ఇది కాబట్టి, ‘టాక్సిక్’ పై చాలా అంచనాలు ఉన్నాయి.

# మ్యాక్స్‌వెల్ ఖాతాలో అరుదైన సిక్సర్ల రికార్డు

ఆసీస్ విధ్వంసకర వీరుడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో అరుదైన మైలురాయిని తాకాడు. 2025-26 ఎడిషన్‌లో భాగంగా ఇవాళ (డిసెంబర్ 28) సిడ్నీ థండర్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన అతను.. బీబీఎల్ కెరీర్‌లో 150 సిక్సర్ల మార్కును దాటాడు. ఈ మ్యాచ్‌లో 2 సిక్సర్లు బాదిన మ్యాక్సీ బీబీఎల్‌లో తన సిక్సర్ల సంఖ్యను 151కి పెంచుకున్నాడు. తద్వారా లీగ్ చరిత్రలో 150 సిక్సర్ల మార్కును తాకిన రెండో బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. మ్యాక్సీకి ముందు క్రిస్ లిన్ మాత్రమే 150 సిక్సర్ల మార్కును తాకాడు. లిన్ ఖాతాలో ప్రస్తుతం 220 సిక్సర్లు ఉన్నాయి. బీబీఎల్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల టాప్-5 జాబితాలో లిన్, మ్యాక్సీ తర్వాతి స్థానాల్లో బెన్ మెక్‌డెర్మాట్ (140), ఆరోన్ ఫించ్ (118), మార్కస్ స్టోయినిస్ (111) ఉన్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. సిడ్నీ థండర్‌పై మ్యాక్స్‌వెల్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన థండర్.. హరీస్ రౌఫ్ (4-0-29-3), టామ్ కర్రన్ (4-0-22-2), స్టోయినిస్ (3-0-25-2), మిచెల్ స్వెప్సన్ (4-0-18-2), పీటర్ సిడిల్ (4-0-22-1) దెబ్బకు 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి 128 పరుగులకు ఆలౌటైంది. థండర్ ఇన్నింగ్స్‌లో షాదాబ్ ఖాన్ (25) టాప్ స్కోరర్ కాగా.. మాథ్యూ గిల్క్స్ (24), సామ్



బిల్లింగ్స్ (23) మాత్రమే 20కి పైగా స్కోర్లు చేశారు. మిగతా ఆటగాళ్లలో కొన్‌స్టాస్ 11, డేవిడ్ వార్నర్ 10, బాన్‌క్రాఫ్ట్ 10, డేనియల్ సామ్స్ 3, క్రిస్ గ్రీన్ 1, తన్వీర్ సంఘా 1, ర్యాన్ హ్యాడ్లీ 1 పరుగు చేశారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని మెల్‌బోర్న్ ఒకే వికెట్ కోల్పోయి 14 ఓవర్లలోనే ఛేదించింది. జో క్లార్క్ (37 బంతుల్లో 60బీ 8 ఫోర్లు, సిక్స్) మెరుపు అర్ధ సెంచరీతో మెల్‌బోర్న్‌ను గెలుపు వాకిటి వరకు తీసుకెళ్లాడు. అనంతరం సామ్ హార్పర్ (29 నాటౌట్), మ్యాక్స్‌వెల్ (39 నాటౌట్‌బీ 5 ఫోర్లు, 2 సిక్సర్లు) మిగతా కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

# హాకీ ఇండియా లీగ్‌కు వేళాయే..

మహిళల హాకీ ఇండియా లీగ్ రెండో సీజన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని నిమిషాల్లో రాంచీ వేదికగా ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే.. తొలి సీజన్ ఛాంపియన్ ఒడిశా వారియర్స్ ఈసారి బరిలోకి దిగడం లేదు. ఈ జట్టు స్థానంలో రాంచీ రాయల్స్ ఆడనుంది. దాంతో.. ఇప్పుడు కూడా నాలుగు జట్లు ట్రోఫీకోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్, జేఎస్‌డబ్ల్యూ సూర్మ హాకీ క్లబ్, శ్రచి బెంగాల్ టైగర్స్ జట్లు టైటిల్ వేటకు సిద్ధంగా ఉన్నాయి. రాంచీ వేదికగా మహిళల హాకీ ఇండియా లీగ్ రెండో సీజన్ రోజు (డిసెంబర్ 28) రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. ఆరంభ పోరులో రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్ జట్లు తలపడనున్నాయి. నాలుగు జట్లు ఒక్కోటి మరో జట్టుతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతాయి. అనంతరం టాప్ -2 జట్ల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది. జనవరి 10న జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీ ముగుస్తుంది.



## స్పోర్ట్స్

# గౌతమ్ గంభీర్‌పై వేటు.. తుది నిర్ణయం ప్రకటించిన బీసీసీఐ



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రయాణం మిశ్రమ ఫలితాలతో కూడుకొని ఉంది. అతని మార్గదర్శకత్వంలో భారత జట్టు పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో అదరగొడుతున్నా.. టెస్ట్‌ల్లో మాత్రం తేలిపోతుంది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో క్లీన్ స్వీప్‌తో (0-3)మొదలైన గంభీర్ టెస్ట్ ప్రస్థానం (టీమిండియా హెడ్ కోచ్‌గా).. తాజాగా స్వదేశంలోనే సౌతాఫ్రికా చేతిలో క్లీన్ స్వీప్ (0-2) వరకు సాగింది. ఈ మధ్యలో గంభీర్ మార్గదర్శకత్వంలో భారత జట్టు ఒక్క విండీస్‌పై మాత్రమే సానుకూల ఫలితం (2-0) సాధించింది. దీనికి ముందు ఆసీస్ పర్యటనలో 1-3తో సిరీస్ కోల్పోయి, ఇంగ్లండ్ పర్యటనలో డ్రాతో (2-2) గట్టెక్కింది. టెస్ట్‌ల్లో పేలవ ట్రాక్ రికార్డు కలిగి ఉండటంతో పాటు అనునిత్యం వివాదాలతో సావాసం చేసే గంభీర్‌ను టెస్ట్ జట్టు హెడ్ కోచ్ విధుల నుంచి తప్పించాలని సర్వత్రా డిమాండ్లు వినిపిస్తున్నాయి. త్వరలో గంభీర్‌పై వేటు ఖాయమని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.

గంభీర్ స్థానంలో భారత టెస్ట్ జట్టు హెడ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ ఎంపిక ఖరారైందని పలు జాతీయ మీడియా సంస్థలు కూడా కథనాలు ప్రసారం చేశాయి. ఇదే అంశంపై తాజాగా బీసీసీఐ స్పందించింది. కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. గంభీర్‌పై వేటు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. టెస్ట్ జట్టు విధుల నుంచి గంభీర్‌ను తప్పించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై వస్తున్న పుకార్లను కొట్టిపారేశారు. గంభీర్ టెస్ట్ జట్టు కోచ్‌గా కొనసాగడానికి మద్దతు ప్రకటించారు. సైకియా చేసిన ఈ ప్రకటనతో గంభీర్ టెస్ట్ హెడ్‌కోచ్‌మెన్‌షిప్‌పై ఊహాగానాలు తొలగిపోయాయి.

ముందుంది ముసళ్ల పండగ

ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో (2005-27) గంభీర్ మార్గదర్శకత్వంలో భారత టెస్ట్ జట్టు పరిస్థితి దయనీయంగా ఉంది. గంభీర్ రాకకు ముందు వరుసగా రెండు డబ్ల్యూటీసీ సైకిల్స్‌లో ఫైనల్స్‌కు చేరిన టీమిండియా.. గత ఎడిషన్‌లో ఫైనల్స్‌కు చేరుకుండానే ఇంటిదారి పట్టింది. తాజా సైకిల్‌లో కూడా పరిస్థితి అలాగే కొనసాగుతుంది. ఈ సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు ఆడిన 9 టెస్ట్ మ్యాచ్‌ల్లో కేవలం 4 విజయాలు మాత్రమే సాధించి, పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో ఉంది. ఈ సైకిల్‌లో టీమిండియా ఫైనల్‌కు చేరాలంటే ఇంకా ఆడాల్సిన 9 టెస్టుల్లో కనీసం 6 విజయాలు సాధించాలి. అయితే ఇలా జరగడం అంత ఈజీగా కనిపించడం లేదు. భారత్ తదుపరి ఐదు ఆస్ట్రేలియాతో, రెండు న్యూజిలాండ్‌తో ఆడాల్సిన ఉంది. మిగిలిన రెండు శ్రీలంకతో ఆడాల్సి ఉంది. శ్రీలంకపై టీమిండియా పైచేయి సాధించినా.. ఆసీస్, కివీస్‌పై గెలవడం మాత్రం అంత ఈజీగా కాదు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.